APTEL/2008/28200




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం

సంపుటి: 16 సంచిక : 112 కరీంనగర్ | శుక్రవారం, సెప్టెంబరు 06, 2024 | ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ | పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


## రోజుకో అత్యాచారం, గంటకో అఘాయిత్యం.. ఇదేనా మార్పు ?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లాకి సంబంధించిన ఆదివాసీ ఆడబిడ్డపై ఆగష్టు 31 న జరిగినట్వంటి అత్యాచారం మరియు హత్య యత్నం ను ఉద్దేశించి ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ధర్నాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పిలుపునిచ్చారు. దానిలో భాగంగా ఈరోజు గాంధీ హాస్పిటల్ లో ఉన్న బాధిత మహిళను పరామర్శించడానికి వెళ్లిన శిల్పారెడ్డి బాధిత కుటుంబంతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసనిచ్చారు . మహిళ పై జరిగింది హత్యాచారమే అని కుటుంబ సభ్యులు మీడియా సాక్షిగా చెప్పినా మంత్రి సీతక్క ఈ కేసుని పక్కతోవ పట్టించే తీరును నిరసిస్తూ మహిళకి న్యాయం జరగాలని గాంధి హాస్పిటల్ ముందు బైటాయించిన శిల్పారెడ్డి గారు.

## వరద బాధితులకు వైద్య సేవలు

ఖమ్మం : హెటిరో సంస్థల, సింధు హాస్పిటల్స్ చైర్మన్ రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధి రెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో వరద బాధితులకు సింధు హాస్పిటల్స్ బృందాలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలను ప్రారంభించారు. వరద బాధితుల సహాయార్థం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కి కోటి రూపాయల చెక్కును పార్థసారధి రెడ్డి అందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వరద బాధితుల సహాయార్థం రాష్ట్రానికి కోటి రూపాయలు చొప్పున విరాళంగా పార్థసారధి రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా..పార్థసారధి రెడ్డి మాట్లాడుతూ..ఖమ్మం జిల్లాలో ప్రకృతి విలయంతో పేద ప్రజలు నిరాశ్రులయ్యారన్నారు. ఈ ప్రాంత వాసిగా నా వంతుగా సహాయం అందించడం నా బాధ్యతగా భావించనన్నారు. మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య మాట్లాడుతు..ఖమ్మం జిల్లా వాసులకు, మన జిల్లాకు ఏ విపత్తు, ఏ ఆపద సంభవించిన నేను ఉన్నానంటూ పార్థసారధి రెడ్డి ఆపన్న హస్తం అందిస్తున్నారాన్నారు.

## ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..?



హైదరాబాద్ సెప్టెంబర్ 5 : తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అక్రమ అరెస్ట్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలన అంటే ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కడమేనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్, తెలంగాణవాది కొణతం దిలీప్‌ను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు.కొంతకాలంగా ప్రభుత్వ అసమర్థ చేతగాని తనాన్ని దిలీప్ ప్రశ్నించటాన్ని రేవంత్ సర్కార్ తట్టుకోలేకపోతోంది. కొన్ని రోజుల క్రితం కూడా తప్పుడు కేసులో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే హైకోర్టు చీవాట్లు పెట్టిన బుద్ధి రాలేదు. ఎలాగైనా దిలీప్ గొంతునొక్కాలన్న ఉద్దేశంతో మరోసారి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో కూడా చెప్పకుండా అరెస్ట్ చేశారని కేటీఆర్ పేర్కొన్నారు.అక్రమ అరెస్ట్‌లు, నిర్బంధాలతో పాలన కొనసాగించవచ్చునుకుంటే అది మీ భ్రమే.

# ఏఐ హబ్‌గా తెలంగాణా

## కొత్త ఆవిష్కరణలతో జీవితాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 : కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయని.. సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐ రోడ్ మ్యాప్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. కొత్త ఆవిష్కరణలు ఆశలతో పాటు భయాన్ని తీసుకొస్తాయని.. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదని అన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశామని.. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుందని చెప్పారు. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దామని అన్నారు.'సాంకేతికత, ఆవిష్కరణ లేకుండా సమాజంలో ఏ మార్పు జరగదు. మొదటి రైలు, ఇంజిన్ ఆవిష్కరణ తరువాత ప్రపంచం పూర్తిగా మారింది. విమానం ఆవిష్కరణతో ప్రపంచ స్వరూపమే మారిపోయింది. ఇదే క్రమంలో కరెంటు, బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్.. ఇలా ఇవన్నీ ప్రపంచ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. ఆధునిక సాంకేతికతతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వాడడం మన తరం చేసుకున్న అదృష్టం. ఇవాళ ప్రపంచ సాంకేతిక రంగంలో వచ్చిన అత్యుత్తమ ఆవిష్కరణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా కొంత భయం నెలకొంటుంది. అది



మన జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుంది.. అదే సమయంలో ఉద్యోగాలు పోతాయా భయం ఉండటం సహజం. దేశ చరిత్రను పరిశీలిస్తే.. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని సరిగ్గా అనుసరించలేకపోయాం. భారతదేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే.. హైదరాబాద్ సిటీలా మరే సిటీ పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణంగా సిద్ధంగా లేదు. ఇందుకు సంబంధించిన సవాళ్లను స్వీకరించడమే కాదు. భవిష్యత్తును సృష్టిస్తాం. హైదరాబాద్‌ను ఎఐ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నామనేందుకు ఈ సదస్సు నిదర్శనం. సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌కి మీ అందరికి స్వాగతం.' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.ఏఐలో పట్టు సాధించబోతున్నామని.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. డీప్ ఫేక్ లాంటి ఘటనలు జరగకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని.. ప్రపంచ స్థాయి యూనివర్శిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాబోయే 2 రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐపైనా చర్చలు,స సెమినార్లు ఉంటాయని అన్నారు.

## గోదావరిలో పెరుగుతున్న నీటి మట్టం

భద్రాద్రి కొత్తగూడెం : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ఈరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు గోదావరి నీటిమట్టం 43.1 అడుగులకు చేరటంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఇంకా వస్తున్నందు వల్ల భద్రాచలం వద్ద ఇంకా నీటిమట్టం పెరుగుతుందని కేంద్ర జల వనరుల శాఖ అధికారులు తెలుపుతున్నారు. భద్రాచలం తో పాటు గోదావరి పరిసర ప్రాంతాల లోతట్టు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. జాలారులు పడవలు నడిపేవారు ప్రయాణికులు గోదావరి పరివాహక ప్రాంతాలకు వాగులు, వంకల వద్దకు వెళ్ళవద్దని సూచించారు. భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరద నీటిలో మునిగిపోయాయి. ఇంకా నీటిమట్టం పెరిగితే పలు రహదారులకు వరద నీరు చేరే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## వికీపీడియాను మందలించిన ఢిల్లీ హైకోర్టు




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 : ప్రముఖ సమాచార సంస్థ వికీపీడియాకు షాక్ తగిలింది. వార్తా సంస్థ ఏఎన్ఐ వికీపీడియాపై పరువు నష్టం కేసు వేసిన విషయంలో కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత న్యాయవ్యవస్థ ఆదేశాలను పాటించకపోతే, భారతదేశంలో తమ వ్యాపారాన్ని మూసివేయమని ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని స్పష్టం చేసింది. మీకు భారతదేశం నచ్చకపోతే ఇక్కడ మీ కార్యాకలాపాలు మూసివేయాలని కోర్టు తెలిపింది. అయితే కోర్టు ఎందుకు ఈ వ్యాఖ్యలు చేసింది, ఏం జరిగిందనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. వికీపీడియా తన పేజీలో ప్రస్తుత ప్రభుత్వానికి 'ప్రచార సాధనం'గా పేర్కొన్న సమాచారాన్ని రాసిందని వార్తా సంస్థ తెలిపింది. ఈ క్రమంలో వార్తా సంస్థ ఏఎన్ఐ వికీపీడియాపై ఢిల్లీ కోర్టులో రూ.2 కోట్ల పరువునష్టం దావా వేసింది. వికీపీడియా తన ప్లాట్‌ఫారమ్‌లో సవరణలు చేసుకోవడానికి వ్యక్తులను అనుమతిస్తోందని ఆరోపించింది. పేజీలో వార్తా సంస్థకు బదులుగా ప్రభుత్వ ప్రచార సాధనంగా ఉందని వికీపీడియా ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు గురువారం (సెప్టెంబర్ 5, 2024) వికీపీడియాకు ధిక్కార నోటీసు జారీ చేసింది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆ సంస్థను హెచ్చరించింది. వికీపీడియా తన ప్లాట్‌ఫారమ్‌లోని వార్తా సంస్థ పేజీలలో అవమానకరమైన విషయాలను ప్రచురిస్తోందని ఆరోపించింది.

## కేంద్రం ఆదుకోవాలి

ఖమ్మం : నేలకొండపల్లి మండలం కట్టుకాచారం లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా తెలంగాణా లోని పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వరదల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగింది. అర్ధరాత్రి వచ్చిన వరదలతో వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. గడిచిన100 సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున వరదలు ఎప్పుడూ రాలేదు. వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు వచ్చి వరదల వల్ల ఏర్పడిన పరిస్థితి చూసారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. వరదలను జాతీయ విపత్తుగా కేంద్ర ప్రభుత్వం స్వీకరించాలి. తెలంగాణ వ్యాప్తంగా 5438 కోట్ల రూపాయల నష్టం జరిగిందని అంచనా. కేంద్ర ప్రభుత్వం వెంటనే 2 వేల కోట్లు ఇచ్చి ఆదుకోవాలని ముఖ్యమంత్రి లేఖ రాశారు.

## జైనూరు లో టెన్షన్

అదిలాబాద్, సెప్టెంబర్ 5 : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో టెన్షన్ వాతావరణం నెలకొంది. అక్కడ వెయ్యి మంది పోలీసులతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్ఫ్యూతో పాటు జైనూరులో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. బయటి వ్యక్తులు జైనూరు వెళ్ళడానికి అనుమతి లేదని జిల్లా ఎస్పీ తేల్చి చెప్పారు. జైనూరు మండలం దేవుగూడకు చెందిన ఆదివాసీ మహిళ (45)పై షేక్ మగ్దూం అనే ఓ ఆటోడ్రైవర్ లైంగిక దాడికి యత్నించడంతోపాటు తీవ్రంగా గాయపర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటన కారణంగానే జైనూరులో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని అన్నారు. పోలీసు యంత్రాంగం నిందితుడిపై కేసులను నమోదు చేసిందని, దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు. కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని తెలిపారు. వదంతులను ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని నిజా నిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లపై చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. వారిపై కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా జైనూరులో 144 సెక్షన్ అమలులో ఉందని ఇతర ప్రాంతాలవారికి జైనూరు రావడానికి అనుమతి లేదని తేల్చి చెప్పారు. టౌన్ చుట్టూ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. తప్పు చేసిన వారికి శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైనూర్ బాధితురాలిని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గారు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్ లతో మాట్లాడి మహిళ ఆరోగ్య పరిస్థితిపై అరా తీశారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచనలు చేశారు. మహిళపై జరిగిన ఘనటను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని అన్నారు. ఇరు వర్గాలు సంయమనం పాటించాలని, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## భారత్ లో సింగపూర్ భారీగా పెట్టుబడులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్నారు. బుధవారం సింగపూర్ చేరుకున్న ఆయనకు అఖండ స్వాగతం లభించగా, గురువారం సింగపూర్ పార్లమెంట్‌లో కూడా ఘనస్వాగతం లభించింది. అంతకుముందు ప్రధాని మోదీ బ్రూనైలో పర్యటించారు. ఇక, రెండో రోజు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ప్రధాని మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ఆ తర్వాత సింగపూర్ పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, ఇతర ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమయంలో, సెమీకండక్టర్లకు సంబంధించిన ప్రధాన ఒప్పందంతో సహా రెండు దేశాల మధ్య అనేక ముఖ్యమైన ఒప్పందాలు జరిగాయి. డిజిటల్ టెక్నాలజీ, హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో భారత్, సింగపూర్ మధ్య ఒప్పందాలు కూడా కుదిరాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, లారెన్స్ వాంగ్ నాయకత్వంలో సింగపూర్ మరింత వేగంగా పురోగమిస్తుందని కొనియాడారు. సింగపూర్ ఒక దేశం మాత్రమే కాదు, అభివృద్ధి చెందుతున్న ప్రతి దేశానికి సింగపూర్ స్ఫూర్తి. భారతదేశంలో కూడా అనేక సింగపూర్‌లను సృష్టించాలనుకుంటున్నామన్నారు ప్రధాని మోదీ. ఈ దిశలో రెండు దేశాలు కలిసి పని చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.భారతదేశం–సింగపూర్ ద్వైపాక్షిక సంబంధాల 60వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ పర్యటన జరుగుతోంది, ఇది రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ సింగపూర్‌లోని వ్యాపారవేత్తలు, పెద్ద కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. దక్షిణ చైనా సముద్రం, మయన్మార్ వంటి ప్రాంతీయ అంశాలపై చర్చించారు. సింగపూర్ యాఇంఔ దేశాలలో భారతదేశం అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ప్రపంచంలో భారతదేశం ఆరవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. సింగపూర్ భారతదేశానికి ఎఫ్‌డిఐకి ప్రధాన వనరుగా ఉంది. సెమీకండక్టర్ రంగంలో 20 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉంది.భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ నిబద్ధతను తెలియజేసేందుకు అనేక ప్రముఖ సింగపూర్ కంపెనీలకు చెందిన టాప్ సీఈవోలు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బ్లాక్‌స్టోన్ సింగపూర్, టెమాసెక్ హోల్డింగ్స్, సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, క్యాపిటా ల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, ూ టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ మరియు ఇతర ప్రముఖ కంపెనీలకు చెందిన నాయకులు ఉన్నారు. చర్చల సందర్భంగా, తమ ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి, భారతదేశంలోని విభిన్న రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి తమ నిబద్ధతను స్పష్టం చేశారు. ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా భారతదేశంను ఎంచుకుంటున్నట్లు అయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక వృద్ధిని పెంచడానికి చేపట్టిన వ్యూహాత్మక కార్యక్రమాలపై చర్చించారు. ఈ హై–ప్రొఫైల్ సింగపూర్ సంస్థల నిబద్ధత భారతదేశ ఆర్థిక వృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నారు. పెట్టుబడి రంగాలలో మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ నుండి డేటా సెంటర్లు, విమానయానం వరకు అనేక రకాల రంగాల ప్రతినిధులతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు.

## తెలంగాణలోరాబోయే ఐదురోజుల పాటు భారీ వర్షాలు



హైదరాబాద్/అమరావతి సెప్టెంబర్ 5 : తెలంగాణలో రాబోయే ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిన్నటి ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఇవాళ వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతిదిశగా వంగి ఉందని.. రాబోయే రెండురోజుల్లో ఉత్తర దిశగా వైపు కదులుతుందని తెలిపింది. ఇక రుతుపవన ద్రోణి సూరత్‌గఢ్, రోహ్‌తక్, ఒరై, మండ్లా మీదుగా వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర–దక్షిణ ఒడిశా తీరంలోని అల్పపీడన కేంద్రం నుంచి ప్రయాణిస్తూ ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించి ఉందని తెలిపింది. తెలంగాణలో గురువారం నుంచి ఈ నెల 9 వరకు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఆసిఫాబాద్, నిర్మల్,నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, సెప్టెంబరు 06, 2024


# బుల్డోజర్ పాలిటిక్స్

బుల్డోజర్ పేరు మీరు చాలాసార్లు విని ఉంటారు. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించినప్పుడల్లా బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బుల్డోజర్ ఒక శక్తివంతమైన యంత్రం. ఇది అందరికీ తెలుసు. బుల్డోజర్ 90ల పిల్లలకు కూడా ఇష్టమైన వాహనం. ఇది తవ్వకాలకు, చెత్తను తొలగించడానికి, ఆక్రమణలను తొలగించడానికి ఉపయోగిస్తారు. ఈ రోజుల్లో బుల్డోజర్ అనే పదం బాగా ప్రాచుర్యం పొందింది. అయితే దీని అసలు పేరు మీకు తెలుసా? బుల్డోజర్ గురించి చాలా మందికి తెలియని విషయాలు ఇక్కడ తెలుసుకుందాం..ప్రస్తుతం తెలంగాణలో ఈ బుల్డోజర్ ఫీవర్ కొనసాగుతోంది. బుల్డోజర్ చర్యకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తోంది. దీని తదుపరి విచారణ సెప్టెంబర్ 17, 2024న జరగనుంది. అయితే, ఈ బుల్డోజర్ వాహనం అసలు పేరు ఇది కాదని మీకు తెలుసా? ఇతర వాహనాలతో పోలిస్తే దీని మైలేజీని కూడా భిన్నంగా కొలుస్తారు. భారతదేశంలో అత్యధికంగా బుల్డోజర్లను విక్రయించే కంపెనీ జేసీబీ. కానీ చాలామంది బుల్‌డోజర్ అంటే జేసీబీ అని అర్థం చేసుకుంటారు. పసుపు రంగు బుల్డోజర్‌పై నలుపు రంగులో జేసీబీ బ్రాండ్ పేరు రాయడం సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది.. ఇది కాకుండా ఇతర కంపెనీలు కూడా బుల్డోజర్లను విక్రయిస్తాయి. మార్కెట్లో అనేక రకాల బుల్డోజర్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కెపాసిటీ, మైలేజీ, ధర మొదలైన వాటిలో తేడా ఉంటుంది. బుల్డోజర్ అసలు పేరు బ్యాక్‌హో లోడర్. బుల్డోజర్ లేదా బ్యాక్‌హో లోడర్ కోసం 'మైలేజ్' అనే పదాన్ని కొద్దిగా భిన్నంగా ఉపయోగిస్తారు. దేశంలో వివిధ రకాల బుల్డోజర్ యంత్రాలు పనిచేస్తాయి. మెషీన్‌లు వివిధ మోడల్‌లలో వస్తాయి. కార్లు లేదా బైక్‌ల మాదిరిగా కాకుండా వాటి మైలేజీని లీటర్‌కి కిలోమీటర్లలో లెక్కించరు. బదులుగా, బుల్డోజర్ ఒక గంటలో ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని కొలుస్తారు. బుల్‌డోజర్‌కి మైలేజ్ ఎంత అనేది అది గంటసేపు నడిచినప్పుడు ఉపయోగించే డీజిల్ మొత్తాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. బుల్‌డోజర్ జస్టిస్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నిందితుడు అయినంత మాత్రాన ఇల్లు కూల్చివేయాలా అని కేంద్రాన్ని ప్రశ్నించింది. బుల్‌డోజర్ న్యాయాన్ని నిలదీస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ దుశ్యంత్ దావే వాదించారు. దేశవ్యాప్తంగా ఈ బుల్‌డోజర్ న్యాయాన్ని అమలు చేయాలని చూస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ న్యాయాన్ని తప్పుబట్టింది. నేరం చేసినంత మాత్రాన ఆ వ్యక్తి ఆస్తుల్ని ధ్వంసం చేయడం సరికాదని తేల్చి చెప్పింది. ఆ ఇంటి నిర్మాణం అక్రమం అని తేలినప్పుడే ధ్వంసం చేయాలని స్పష్టం చేసింది. దీనిపై కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలు అని తేలినప్పుడు ముందు నోటీసులు ఇవ్వాలని, వాళ్లు స్పందించని పరిస్థితుల్లో చట్టానికి లోబడి ధ్వంసం చేయాలని తేల్చి చెప్పింది. "ఇళ్లు కూల్చివేయాలంటే అంత కన్నా ముందు కచ్చితంగా కొన్ని మార్గదర్శకాలు పాటించాలి. కేవలం ఓ నేరం చేసినంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా. ఒకవేళ అది అక్రమ నిర్మాణం అని తేలితే పరవాలేదు. కానీ కేవలం నిందితుడు అన్న కారణానికి ఇల్లు కూల్చివేస్తామనడం మాత్రం సరికాదు. ఈ విషయంలో కచ్చితంగా ఓ విధానాన్ని అనుసరించాలి. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘిస్తేనే కూల్చివేస్తున్నామని మీరు చెబుతున్నారు. అయితే...అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తప్పకుండా ఉండాలి"– సుప్రీంకోర్టు ధర్మాసనం . పిటీషనర్ల తరపున అడ్వకేట్ దుశ్యంత్ దావే, సీయూ సింగ్ కోర్టులో తమ వాదనలు వినిపించారు. ఢిల్లీలోని జహంగీర్‌పురిలో చేపట్టిన కూల్చివేతల గురించి ప్రస్తావించారు. 50,60 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లనూ కూల్చివేస్తున్నారని చెప్పారు. కొన్ని కేసులనూ ఈ సందర్భంగా ఉటంకించారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఓ ఘటన జరిగింది. ఓ విద్యార్థి తోటి విద్యార్థిని కత్తితో పొడిచాడు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వెంటనే అధికారులు ఆ నిందితుడి ఇల్లు కూల్చి వేశారు. దీనిపైనే అడ్వకేట్స్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "కొడుకు తప్పు చేస్తే తండ్రి కట్టుకున్న ఇల్లుని కూల్చివేయడమేంటి" అని ప్రశ్నించారు. ఇది సరికాదని స్పష్టం చేశారు. నేరస్థులు అని నిర్ధరణ అయినప్పటికీ ఇళ్లు కూల్చివేసే హక్కు లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ బుల్‌డోజర్ జస్టిస్‌పై ఎన్నో వివాదాలు కొనసాగుతున్నాయి. ఇదేం న్యాయం అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్దతునిచ్చే వాళ్లు ఉన్నప్పటికీ అదే స్థాయిలో వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. మరో వైపుమాజ్ వాదీ పార్టీ 2017లో అధికారంలోకి వస్తే అన్ని బుల్డోజర్లను గోరఖ్‌పూర్ వైపు నడిపిస్తామని అఖిలేష్ యాదవ్ మంగళవారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ కావడంతో ఈ వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. అఖిలేష్ హెచ్చరికలను యోగి ఆదిత్యనాథ్ బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో తిప్పికొట్టారు. బుల్డోజర్ నడపడానికి ధైర్యం, తెలివితేటలు, దృఢ సంకల్పం ఉండాలని, ఆ లక్షణాలేవీ యాదవ్‌లో లేవని అన్నారు. "అందరి చేతులు బుల్డోజర్ నడపడానికి పనికి రావు. దానికి ధైర్యం, తెలివితేటలు (దిల్, దిమాగ్) ఉండాలి. సమర్థత, దృఢ సంకల్పం ఉన్నవాళ్లే బుల్డోజర్ నడపగలరు. అల్లర్లు సృష్టించేవారి ముందు మోకరిల్లేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు" అని కౌంటర్ ఇచ్చారు. అఖిలేష్ యాదవ్‌ను 'టిప్పు' అనే నిక్‌నేమ్‌తో యోగి సంబోధిస్తూ, టిప్పు ఇప్పుడు సుల్తాన్ కావాలని ప్రయత్నిస్తున్నారంటూ చురకలు వేశారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు యూపీలో 'ఆటవికపాలన' ఉండేదన్నారు. అఖిలేష్ యాదవ్, ఆయన అంకుల్ శివపాల్ యాదవ్‌లు బలవంతపు వసూళ్లు చేసేవారని, ఏరియాలు పంచుకుని మనీ లూటీలకు పోటీ పడేవారని ఎద్దేవా చేశారు.

# నూతన పెన్షన్ రద్దుకు మరో ఉద్యమం



మెదక్, సెప్టెంబరు 1: నూతన పెన్షన్ విధానం రద్దుకు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నట్లు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం అమలైన 20 ఏళ్లల్లో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భద్రతనిచే పెన్షన్ లేకపోవడంతో చాలామంది విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నిరసనలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, టీఎన్జీవో, ట్రెసా, పీఆర్టీయూ, తపస్, టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, మహేందర్‌గౌడ్, సుంకరి కృష్ణ, ఎల్లం, సంగయ్య, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మరావు, శివయ్య, సత్యనారాయణ, వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు మల్లారెడ్డి, చంద్రశేఖర్, హీరాలాల్, సత్యనారాయణరెడ్డి, ఫణిరాజ్, ఫజులొద్దీన్, నగేష్, శివరాం, గోపాల్, రామాగౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. నర్సాపూర్: పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్ మండల విద్యాధికారి కార్యాలయం వద్ద వర్షంలోనే ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అ?ధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ 2004 నుంచి అమలవుతున్న నూతన పెన్షన్ వల్ల ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాకియా, నాగుర్‌మీరా, రమేషరాజు, శివకమార్, అప్పలనాయుడు, భాస్కర్, శ్రీహరి, పెంటయ్య, నరేందర్, శ్రీహరి, కృష్ణ, శ్రీనివసరావు, రాములు పాల్గొన్నారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈజేఏసీ చైర్మన్ జావిద్‌అలీ, కో చైర్మన్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు వర్షాన్ని లెక్కచేయకుండా నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ నిరసన ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానం రద్దు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ వేతన సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల నాయకులు వై.అశోక్‌కుమార్, సాబేర్‌అలీ, వి.రవి, సుధామణి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకుడు గ్యాదరి పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేంత వరకు అన్ని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలను కలుపుకొని ఐక్యపోరాటం చేస్తామన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 1న పెన్షనర్ల విద్రోహ దినమని తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్తాబాద్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస్, శశిధరశర్మ, రాజేశం, యాదగిరి పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే లేఅవుట్లకు అనుమతి



వనపర్తి, సెప్టెంబరు 5 : ప్రభుత్వం సూ చించిన నిబంధన లు పాటిస్తేనే లే అవుట్లకు అనుమతి లభిస్తుందని కలెక్టర్ ఆదర్శసురభి అన్నారు. ప్రభుత్వ భూమి, చెరువు శిఖం, కాలువల పక్కన ఉన్న లేఅవుట్‌లను అనుమతించమని ఆయన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి లేఅవుట్‌ల కమిటీ సమావేశమై టీజీ బిపాస్ ద్వారా వచ్చిన నాలుగు లేఅవుట్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచ నలు చేశారు. అనంతరం పరిశీలనకు వచ్చిన వాటిలో ఒక డ్రాఫ్ట్ లేఅవుట్‌కు ఆమోదం తెలిపి, మరో దానిని షరతులతో ఆమోదించారు. వివిధ కారణాలతో మరో రెండు లేఅవుట్లను పెండింగ్ లో పెట్టారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సం చిత్ గంగ్వార్(లోకల్‌బాడీస్), నగేష్(రెవెన్యూ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయ తీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఇరిగేషన్ ఈఈ మధుసూదన్, రోడ్లు భవనాల డీఈ సీతారామస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణా కర్, విద్యుత్ శాఖ ఈఈ, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో డెంగి, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు నియంత్రణకు గతం కంటే చాలా ఎక్కువ కృషి చేశామని ఇప్పుడు మరింత గట్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆదర్శ సురభి అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై బుధవారం సాయంత్రం ఐడీవోసీ సమావేశ మందిరంలో వైద్య, మునిసిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీర్లగుట్ట ప్రాంతంలో ఇప్ప టివరకు 10 డెంగీ కేసులు నమోదయ్యాయని అందువల్ల రేపటి నుంచి వారంరోజుల పాటు ప్రతీరోజు డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. గర్భిణులకు మొదటి త్రైమాసికం నుంచి క్రమం తప్పకుండా ఈఎన్‌సీ చెకప్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మలేరియా అడిషనల్ డైరెక్టర్ డా.విజయ్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# మనుషులం కదా, ముద్రలూ మూసలూ ఎందుకు?

నేను అన్నది ఎంతటి సంఖ్యతో సమానం? లక్షలమంది, కోట్లమంది గురించి లెక్కవేస్తున్నప్పుడు కూడా, 'నేను' పక్కన వేసే విలువ ఎంత? నేను అన్నది ఉనికి. ఆ ఉనికిలో నుంచి సమస్త ప్రపంచం, జీవితం వ్యక్తమవుతుంది. కనీసం తనవరకు అయినా 'నేను'తోనే అంతా పుడుతుంది, అంతా అంతమవుతుంది. అటువంటప్పుడు, తనని తాను కేవలం ఒకటిగా లెక్కించుకుని, పెద్ద అంకె ముందు తనను తక్కువ చేసుకోవడం ఎంత కష్టం? ఇతరులను కాపాడడానికి సాహసం చేయడం సరే, అందుకు సిద్ధపడినప్పుడు తనకు తాను చెప్పుకున్న సమర్థన, అనేక ఇతర ప్రాణాల ముందు తానొక్కడే కదా? ప్రాణాలకు తెగించినందుకే కాదు, 'నేను'ను జయించిన ఈ సమర్థన వల్ల కూడా సుభాన్ మనందరి ఆరాధనలకు అర్హుడు. ఒక ఉదాత్తమైన మానవీయత తారసపడినప్పుడు, దైనందిన అల్పత్వం నుంచి ఉద్ధరింపు దొరికిన తన్మయ భావన కలుగుతుంది. ఆ క్షణాలను కూడా కలుషితం చేయడానికి కావలసినంత కల్మషం సమాజంలో యథావిధిగా ప్రవహిస్తూనే ఉంటుంది. సుభాన్ మతం గురించిన ప్రస్తావన అటువంటిదే. అతను ముస్లిమ్ కావడాన్ని ఒకరు ఎక్కువచేసినా, మరొకరు తక్కువ చేసినా, అందులో విషాదం తప్ప మరేమీ లేదు. సుభాన్ స్థానంలో ఒక శంకర్ కూడా ఉండి ఉండవచ్చు అతను కూడా మరొక సమర్థనతో ప్రాణాలకు తెగించి ఉండేవాడేమో? మంచితనం ఏ మతస్థులకూ గుత్త సొత్తు కాదు, చెడ్డ తనం కూడా అంతే. నేరగాళ్లు, ఉత్తములు ఏ గుర్తింపునకు చెందినవారయినా, ఆ గుర్తింపు సమూహమంతా నేరస్థులూ కాదు, నీతివంతులూ కాదు. సమాజంలో తమ, పర భేదాలను తీవ్రంగా విస్తరింపజేసేవారికి, పరులు మంచిపని చేసినప్పుడు అప్రియంగా ఉంటుంది. పరులకు 'మంచి' పేరు వస్తుందన్న ఉక్రోషం ఉంటుంది. సమాజంలో సహజీవన సంస్కృతి కోరుకునేవారికి మాత్రం ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు పండగే. వారిది ఒక నిస్సహాయ స్థితి. 'పరులు'గా చిత్రితమయ్యేవారు కూడా మంచివారే అని చెప్పగలిగే ఉదాహరణలు ఇట్లా రూపొందుతూ ఉండాలి, వారికి. అందరూ, కనీసం శ్రమజీవులందరూ, లోలోపల, సారాంశంలో, పదిమంది కోసం, పదిమందితో నిలబడేవారే అని సుభాన్ సాహసం చెబుతున్నది. అంతిమంగా, మనుషులలో ఉండే ఏకసూత్రతను, ఏకరూపతను చాటిచెబుతూ, ఒక సముదాయాన్ని, జనశ్రేణిని మూకుమ్మడిగా ఇతరులుగా, పరులుగా చిత్రించే ద్వేషవైఖరిని పరాజితం చేస్తున్నది. కానీ, ఈ విలువను నిరూపించడం కోసం, మంచివారిగా, త్యాగజీవులుగా ఉండే నిర్బంధ భారాన్ని ఆ 'పరులు' మోయవలసి రావడం విచారం కలిగిస్తుంది. ఎంత మంచితనాన్ని కుమ్మరిస్తే, నిర్మించి నిర్మించి వదిలిన రాక్షసముద్రలు తొలగిపోతాయి? ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆపద్బాంధవుల్లాగా వచ్చే ధీరోదాత్తులు కొందరున్నట్టే, తామనుకున్న ధర్మాన్ని రక్షించడానికి ప్రాణాలు తీయగలిగేవారు కూడా కొందరు ఉంటారు. వారిలో గోరక్షకులమంటూ ఆయుధాలతో సంచరించేవారు కూడా కొందరుంటారు. వారికి గోవుల రక్షణ ముఖ్యం. అందుకోసం స్వచ్ఛంద సైనికుల్లాగా, ఎక్కడెక్కడ పశువుల రవాణా జరుగుతుందో, ఎవరెవరు పశుమాంసం తింటూ ఉంటారో నిఘావేసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. పట్టుకునే క్రమంలో, ఆగ్రహం ప్రకటించే క్రమంలో మనుషుల ప్రాణాలను తీయడానికి కూడా వారు వెనుకాడరు. చట్టాలను కూడా ఖాతరు చేయని గాఢమైన విశ్వాసం వారిది. హర్యానాలో పోయిన సంవత్సరం పశువుల రవాణాదార్లు అన్న అనుమానంతో ఇద్దరిని వారి వాహనంతో సహా దహనం చేయడం, అనంతరం జరిగిన హింసాకాండ తెలిసిందే. పరిస్థితి ఏమీ మారలేదు. ఈ ఆగ?స్ట నెలాఖరులో పాత సామాన్లు అమ్మి బతికే ఒక వలస కార్మికుడిని ఈ గోరక్షకులు చంపేశారు. అతను బెంగాల్ నుంచి వచ్చాడు. బీఫ్ తిన్నాడని అతని మీద అభియోగం.

ఈ సంఘటన మీద నిరసనలు వినిపించినప్పుడు, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైని దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. "ఆవులంటే వాళ్లకు అంతటి భక్తి, వాళ్లను ఎవరు ఆపగలరు?" అన్నాడాయన. ఇటువంటివి జరగకూడదు, ఇటువంటివి చేయకండి, అని కూడా అన్నారు తప్ప, చేసినవారిని చట్టం ఉపేక్షించదన్న మాట అనలేదు. ఆ ఘాతుకం సరే, దానికి మించి బాధ కలిగించే అంశం, ఆ హత్య చేసినవారిలో ఇద్దరు మైనర్లు ఉండడం. ఎటువంటి తరం తయారవుతోందన్న బాధ కలుగుతుంది. బీజేపీ దట్టిస్తున్న ఆవేశాల వల్లనే ఇటువంటివి జరుగుతున్నాయని టీఎంసీ నాయకురాలు మహువా మొయిత్రా అన్నారు కానీ, బీజేపీ నేతలందరూ సైనీ లాగా మాట్లాడలేదు. "ఇదేమి అన్యాయం? ఇందులో గోరక్షణ ఏముంది? ఇది మానవత్వానికే అవమానం, పోలీసులు కఠినచర్య తీసుకోవాలి" అన్నారు బీజేపీ ఎంపీ ధరంబీర్‌సింగ్. చూపు పూర్తిగా కలుషితం కాని రాజకీయవాదులు లేకపోలేదు. ఈ సంఘటనలో హతుడు నిరుపేద. అతని మతమేమిటో స్పష్టంగా తెలుసును. అతను బీఫ్ తిన్నాడో లేదో కానీ, తినడానికి ఆస్కారమున్న పుట్టుకే అతన్ని చంపడానికి కావలసిన ఆధారం. అతన్ని ఒక మనిషిగా, అతనిది ఒక ప్రాణంగా చూడడానికి ఆ పుట్టుకే ఒక అవరోధం. భారతదేశంలో గోవులను మాంసానికి కానీ, ఇతర అవసరాలకు కానీ వధించడాన్ని నిరోధించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రయత్నిస్తే, అందుకు సామరస్యంతో జనాభిప్రాయాన్ని కూడగట్టడమూ అసాధ్యం కాదు. కానీ, ఇక్కడ సామరస్యమూ, పరిష్కారమూ ముఖ్యం కావు. సమస్య, ఘర్షణా కొనసాగడమే వారికి ప్రయోజనకరం. నిజానికి, సమస్య మూలకారణాలలోకి వెడితే, పరిస్థితి కొంత అర్థమవుతుంది. గోవులను నిర్వహించడం రైతాంగానికి అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. పశువులతో కూడిన వ్యవసాయం బాగా జరిగే రోజుల్లో కూడా, శ్రమచేయలేని, పాలివ్వలేని పశువులను రైతులు విక్రయించేవారు. సంక్షోభంలో ఉన్న రైతాంగమే గోవులను అమ్ముతున్నది. కబేళాలు కొంటున్నాయి. పశుమాంసాన్ని ఇతర దేశాలకు ఎగుమతిచేసే పెద్ద పెద్ద కబేళాలేవీ బీఫ్ భక్షక సామాజిక, మతవర్గాలకు చెందినవి కావు. ఈ రెండు చోట్లా గోరక్షకులు ఏ కార్యక్రమమూ తీసుకోరు. పశుమాంసం ఎగుమతిని నిషేధించమని, కబేళాలు మూసివేయమని వారెప్పుడూ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయరు. తరలింపులు చేసి పొట్టపోసుకునే వారి మీద మాత్రం దాడులు చేస్తారు. మాంసం తీసుకుపోయేవారిని అనుమానిస్తారు. కారణాలు పెద్ద ఆశ్చర్యకరమైనవేమీ కావు. ముద్రలే ముఖ్యం. ముద్రల సహాయంతో చేయగలిగే సమీకరణలు ముఖ్యం. మనుషుల మీద పడే ముద్రలు, ఒక్కోసారి ఆ ముద్రల నుంచి రక్షణ ఉన్నవారిని కూడా బలితీసుకుంటాయి. ఆగస్టు నెలలోనే హర్యానాలో ఒకచోట పశువులను ఎస్‌యువి వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారం తెలిసి, గోరక్షక బృందం మాటువేసింది. ఆ సమయంలో ఎదురైన ఒక వాహనాన్ని అడ్డగించబోతే, లోపల ఉన్నవారు బెదిరిపోయి, వేగం పెంచి పారిపోవడానికి ప్రయత్నించారు. దానితో గోరక్షకులు తుపాకితో కాల్పులు జరిపారు. ఆ ఘటనలో వాహనంలో ఉన్న 12వ తరగతి విద్యార్థి ఆర్యన్ మిశ్రా చనిపోయాడు. బహుశా, ఆ సమయంలో వాహనంలోని వారిని 'గుర్తించడానికి' గోరక్షకులకు వీలుకాలేదో, రూపురేఖలు అందుకు అవకాశం ఇవ్వలేదో? అనుమానితులు, అమాయకులు అందరూ ఒకేరకంగా కనిపించడంలోని 'శారీరక' సారూప్యత ఒక్కోసారి హంతకుల చేత 'పొరపాటు' చేయిస్తుంది. భారతదేశపు ముఖాలలో ఇంకా మతవిభజన జరగలేదు. తరలింపుదారులు వీరే అనుకుని పొరపడ్డామని హంతకులు చెబుతున్నారు తప్ప, తాము చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తుపాకులతో వీధుల్లోకి రావడం తప్పని




అనుకోవడం లేదు. ఈ రెండో వరుస సంఘటన తరువాత కూడా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిలో పెద్ద కదలిక లేదు. రెండు రోజుల కిందట మహారాష్ట్రలో కూడా ఒక ముసలాయనను రైల్లో ఒక గుంపు కిందకు తోసేసినంత పనిచేసింది. ఆయన దగ్గర గోమాంసం ఉన్నదని అనుమానం. అటువంటి ఘటనలు సాధారణమైపోయాయి. కానీ, ఆ గుంపు ఎవరు? పోలీసు ఉద్యోగానికి అర్హత పరీక్ష రాయడానికి వెడుతున్న ఉద్యోగార్థులట! రేపు వాళ్లు పోలీసులైతే, న్యాయం ఎట్లా ఉంటుందో? ఈ సంఘటనల్లో మృత్యువు కంటె, హింస కంటె, దేశవ్యాప్తంగా అది వ్యాపింపజేసే భయమూ పరాయితనమే ఎక్కువ బాధిస్తుంది. అంతో ఇంతో సఖ్యత సహజీవనం ఉన్న దక్షిణాదిలో కూడా, విభజనరేఖలు వెలుస్తున్నాయి. మంచిచెడ్డలను చట్టం కాక, విశ్వాసాలు నిర్వచించి అమలుచేస్తున్నాయి. మూసలను బట్టి, ముద్రలను బట్టి మనుగడలు నిర్ణయం అవుతున్నాయి. విభజనల మీద ఆధారపడి రాజకీయార్థిక పరమార్థాలు చెలరేగిపోతున్నాయి! కొత్త ఆలోచనలు లేకపోవడం ఎవరికైనా అవలక్షణం మాత్రమే, కానీ, బలశాలికీ, పెత్తందారుకీ భావదారిద్ర్యం ఉంటే మాత్రం అది మహా ప్రమాదకరం. ఒకసారి విఫలం అయ్యాక, జనం నీలో చెడు చూడడం మొదలుపెట్టారని తెలిశాక, ఆ గ్రహింపు తెచ్చుకోవడమే మొదట చేయవలసినది. అప్పుడు దిద్దుబాటు కోసం అన్వేషించాలి. అయితే, తప్పులను గుర్తించి దారి సరిచేసుకోవాలి లేదా, కొత్తదారులను వెదుకుతూ ప్రజల సమ్మతిని గెలుచుకోవాలి. ఈ రెండూ చేతకాక, తనకు తెలిసింది ఒకే విద్య, దాన్ని మాత్రమే పదే పదే ప్రయోగిస్తాను, మరింత బలంగా, మరింత తీవ్రంగా ఉపయోగిస్తాను అనుకునే శక్తులు, బహుశా, తమ శూన్యబుద్ధుల కారణంగానే పతనాన్ని చవిచూస్తారు. హర్యానా, మహారాష్ట్ర రెండూ త్వరలో ఎన్నికలకు వెడుతున్న రాష్ట్రాలు. ద్వేషాలను మరింతగా పెంచి లాభపడదామనుకునే రాజకీయాలు గెలుస్తాయా, విసిగి వేసారి లోగుట్టు అర్థం చేసుకున్న ప్రజలు గెలుస్తారా అన్నది చూడాలి.

# పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి ఎదురుగాలి



**ఏలూరు :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైసీపీకి ఎదురుగాలి వీస్తోంది. ఇప్పటికే ఏలూరు కార్పొరేషన్‌ను కోల్పోయిన వైసీపీ.. ఇప్పుడు జడ్పీ పీఠాన్ని చేజార్చుకునేలా కనిపిస్తోందంటున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన జడ్పీ సమావేశంలో వైసీపీ జడ్పీటీసీల తీరును గమనిస్తే? మెజార్టీ సభ్యులు కూటమిలో చేరేందుకు సిద్ధమనే సంకేతాలు పంపినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. జడ్పీ చైర్ పర్సన్ గంట పద్మశ్రీతో సహా దాదాపు 20 మంది జడ్పీటీసీలు నేడోరేపో? కూటమితో జట్టు కట్టేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాలో వైసీపీ వ్యవహారాలను పట్టించుకునే వారు లేకపోవడం, తమ పదవీకాలం ఇంకా రెండేళ్లు ఉండటం వల్ల ప్రభుత్వ సహకారం కోరుతున్న జడ్పీ చైర్‌పర్సన్ టీడీపీలో చేరాలని ఆ పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడు సైతం జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీని పార్టీలో చేర్చుకునేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాను కూటమి క్లీన్ స్వీప్ చేసింది. జిల్లాలో మొత్తం 15 స్థానాలను కూటమి పార్టీలు కొల్లగొట్టాయి. అయినప్పటికీ జిల్లా పరిషత్ కూడా తమ చేతిలో ఉండాలని భావిస్తున్నారు కూటమి నేతలు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు జరగాలంటే స్థానిక సంస్థల్లో బలం ముఖ్యమని భావిస్తున్నారు. ఈ కారణంతోనే ఏలూరు కార్పొరేషన్‌ను టీడీపీ తన ఖాతాలో వేసుకుంది. ఇక జడ్పీని గుప్పిట పెట్టుకోవాలని నిర్ణయించింది. చైర్‌పర్సన్ పద్మశ్రీ టీడీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకోగా, 20 మంది జడ్పీటీసీల్లో కొందరు జనసేన, మరికొందరు టీడీపీ అంటున్నారంటున్నారు. స్థానికంగా వారి రాజకీయ అవసరాలు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 48 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం వైసీపీకి 46 మంది సభ్యుల బలం ఉంది. టీడీపీ, జనసేనకు చెరో సభ్యుడు ఉన్నారు. ఇక జడ్పీ చైర్ పర్సన్‌తోపాటు 20 మంది కూటమిలో చేరితే జడ్పీ కూటమి పరమైనట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా జడ్పీలో ఓటు హక్కు ఉన్నందు వల్ల 20 మంది జడ్పీటీసీలు పార్టీ మారితే? ఎమ్మెల్యేల బలంతో సునాయాశంగా జడ్పీ పీఠాన్ని చేజిక్కుంచుకోవచ్చని లెక్క వేస్తున్నారు. ఐతే జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ చేరికను టీడీపీలోని ఓ ప్రముఖ ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ఎమ్మెల్యే అభ్యంతరం వల్లే చేరిక ఆలస్యమైందని? లేని పక్షంలో ఇప్పటికే జడ్పీలో పసుపు జెండా ఎగిరేదని అంటున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ భర్తకు టీడీపీ ఎమ్మెల్యేకు మధ్య ఎన్నికల సమయంలో తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే సదరు ఎమ్మెల్యే? జడ్పీ చైర్ పర్సన్ చేరికను వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నారు. ఐతే మంత్రి నిమ్మల రామానాయుడు మాత్రం జడ్పీపై టీడీపీ జెండా ఎగరేయాలనే పట్టుదలతో ఎవరు వచ్చినా కాదనకూడదని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయమై మంత్రి నిమ్మల? సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు జడ్పీటీసీలు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతున్నా, వైసీపీలో మాత్రం ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా రెండుగా విభజన కావడంతో ఇద్దరు నేతలు రెండు పార్టీల అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలో కొన్ని మండలాలు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లాయి. దీంతో జడ్పీటీసీలతో మాట్లాడే బాధ్యత ఎవరు తీసుకోవాలనేది వైసీపీ తేల్చుకోలేకపోతోంది. ఏలూరు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన మాజీ మంత్రి ఆళ్ల రాజీనామాతో కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుకు ఏలూరు బాధ్యతలు అప్పగించారు. కైకలూరు ప్రస్తుతం ఏలూరు జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ గతంలో కృష్ణా జిల్లాలో ఉండేది. దీంతో దూలం నాగేశ్వరరావుకు ఉమ్మడి జిల్లా వ్యవహారాలపై పట్టు లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో చొరవ తీసుకోవాల్సిన మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, శ్రీరంగనాథ రాజు వంటి వారు మాకెందుకులే అన్నట్లు మౌనాన్ని ఆశ్రయించారు. ఈ కారణంగా తమను పార్టీలో ఎవరూ పట్టించుకోవడం లేదనే అసంతృప్తి క్యాడర్‌లో పెరిగిపోతోంది. అందుకే వారి ఆలోచనలన్నీ కూటమి వైపు ఉసిగొల్పుతున్నట్లు చెబుతున్నారు.

# వరదల్లో కనిపించని కమలం నేతలు



**విజయవాడ :** ఏపీలో వైసీపీ నేతలు కనిపించడం లేదు. రాష్ట్రంలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. కానీ ఒక్క బీజేపీ నేత కూడా అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల్లో బిజెపి ప్రాతినిధ్యం పెరిగింది. 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు గెలిచారు. ఒకరికి కేంద్రమంత్రి పదవి లభించింది. మరొకరికి రాష్ట్ర క్యాబినెట్లో చోటు దక్కింది. అయితే వారంతా తమ పదవులను హోదాగానే చూస్తున్నారు. బిజెపి తరఫున సేవలందించడం లేదు. ముఖ్యంగా వరద బాధిత ప్రాంతాల్లో టిడిపి తో పాటు జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. కానీ బిజెపి నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి బాధితుల పరామర్శకు వచ్చారు. కానీ ఒకటి రెండు రోజులకే పరిమితమయ్యారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ జాడలేదు. రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ అమెరికాలో ఉన్నారు. దీంతో బిజెపిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు పరిస్థితి ఉంది. కీలకమైన సమయాల్లో వారు ముఖం చాటేయడంతో ఒక రకమైన విమర్శ వ్యక్తమవుతోంది. బిజెపి నేతల తీరు ఇబ్బందికరంగా మారింది. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి కూడా కనిపించడం తక్కువగా మారింది. ఒకే ఒక్క రోజు ఆయన బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. తరువాత ఆయన కనిపించకుండా మానేశారు. ఢిల్లీ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. విజయవాడ ప్రజలు కష్టాల్లో ఉంటే.. ఆ ప్రాంత ప్రతినిధిగా ఉన్న సుజనా చౌదరి వ్యవహరించిన తీరు మాత్రం విమర్శల పాలవుతోంది. నియోజకవర్గ ప్రజలు కష్టాల్లో ఉంటే పట్టించుకోకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సుజనా చౌదరి గెలుపుతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలు మారుతాయి అని భావించారు. కానీ ఇంతటి విపత్తులో కనీసం పట్టించుకోకపోవడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వాస్తవానికి సుజనా చౌదరి రాష్ట్ర క్యాబినెట్లో చోటు ఆశించారు. మంత్రి పదవి దక్కుతుందని భావించారు. అందుకే ఎంపీగా పోటీ చేయకుండా.. ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అయితే అనేక సమీకరణలను పరిగణలోకి తీసుకొని బిజెపి నుంచి సత్య కుమార్ యాదవ్ కు క్యాబినెట్లో తీసుకున్నారు. అప్పటినుంచి నైరాశ్యంలోకి వెళ్లిపోయారు సుజనా చౌదరి. ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవిని ఆశించారు. కానీ చంద్రబాబు పెద్దగా ఆసక్తి చూపు లేదట. అప్పటినుంచి ఢిల్లీకే పరిమితం అయ్యారు సుజనా చౌదరి సుజనా చౌదరి. పొత్తులో భాగంగా బిజెపికి ఛాన్స్ దక్కింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సింది పోయి.. బిజెపి నిర్లక్ష్యం చేస్తుండడం విమర్శలకు కారణమవుతోంది. శాసనసభలో బిజెపి ప్రాతినిధ్యం పెరిగింది. అటు ఎంపీలు ముగ్గురు గెలిచారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాల్లో చోటు దక్కింది. ఇటువంటి సమయంలో యాక్టివ్ గా ఉండి బిజెపిని అభివృద్ధి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి విపత్తు సమయంలో బిజెపి నేతలు యాక్టివ్ గా పనిచేసి.. కేంద్ర నిధులను సైతం రప్పిస్తే ప్రజలు గుర్తించే అవకాశాలు కూడా ఉన్నాయి. కానీ బిజెపి నేతలు అవేవీ పట్టించుకోకుండా ఎవరికి వారే అన్నట్టు ఉన్నారు.

# గజగజలాడిస్తున్న గోదావరి

**రాజమండ్రి :** కృష్ణానది, బుడమేరు వాగు ఉగ్రరూపంతో విజయవాడ మహానగరం గజగజ వణికింది. మునుపెన్నడూ లేనంత వరద ఉగ్రరూపం దాల్చి బెజవాడ నగరాన్ని ముంచెత్తింది. ఎక్కడ చూసినా వరదనీరు పోటెత్తి జనజీవన స్రవంతి అడుగు బయటపెట్టలేని దీనస్థితిలోకి నెట్టింది. 20 మంది ప్రాణాలు బలిగొన్న ఈ వరద బీభత్సం ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. అయితే ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు ఓ పక్క ఎగువ నుంచి వెల్లువలా వస్తోన్న వదర ఉధృతి మరోపక్క భారీ స్థాయిలో వరద నీరు గోదావరికి చేరుతోంది. దీంతో గోదావరిలో భారీ స్థాయిలో వరద ఉధృతి పెరుగుతోండగా భద్రాచలం వద్ద బుధవారం రాత్రి నాటికి 41 అడుగుల స్థాయికి నీటిమట్టం చేరింది. ఇది ఆందోళన కలిగించే అంశం కాగా రాగాల 24 గంటల్లో ఈ వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో అటు తెలంగాణాలోని భద్రాచలం, ఇటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరుగుతుండగా ప్రస్తుతం 41 అడుగుల స్థాయికి వరద ప్రవాహం పెరిగి నిలకడగా ఉంది. ఇది పెరిగే అవకాశం ఉండగా ఈ వరద ప్రవాహం అఖండ గోదావరికి చేరుతోంది. ఈ క్రమంలోనే ధవళేశ్వరం వద్ద వరద ఒరవడి పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది లేకపోయినా రాబోయే మూడు రోజుల్లో మొన్నటి తరహా భారీ వర్షాలు కురిస్తే మళ్లీ వాగులు పొంగి గోదావరికి వరదలు పోటెత్తే అవకాశాలున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజులపాటు ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నుంచి కాస్త తెరుపు ఇచ్చింది వాతావరణం. అయితే కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురైన పరిస్థితి తలెత్తింది. మొన్నటి వరకు వదర ముంపుకు గురై ఇబ్బందులు పడ్డ అంబేద్కర్ కోనసీమ




జిల్లాలోని లంక గ్రామాలులో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరుతో ముంపుకు గురై ఇబ్బందులు తప్పలేదు.. ఇక తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరంలో భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి.. కాకినాడ జిల్లాలోనూ కూడా భారీ వర్షాలకు చాలా కాలనీలు జలమయమయ్యాయి.. గోదావరికి క్రమక్రమంగా వరద ఉధృతి పెరుగుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.. ఉభయగోదావరి జిల్లాల్లోని జిల్లా కలెక్టర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్లు అధికారులను అప్రమత్తం చేస్తూ అత్యవసర సమావేశాలు నిర్వహించారు. భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి గనుక గోదావరికి వరద పోటెత్తితే ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గతేడాది గోదావరికి మూడు సార్లు వరదలు పోటెత్తగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈ ఏడాది కూడా వరదలు ఎక్కువసార్లు వచ్చే అవకాశాలు లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు.

# నియోజకవర్గానికి దూరంగా పెద్దిరెడ్డి ఫ్యామిలీ




**తిరుపతి :** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయ రగడ కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు చేసిన దానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వారు సైతం అదే పంథా కొనసాగిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సొంత గ్రామం చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లి, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నది కుప్పం నియోజకవర్గం... ఇక ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా పని చేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పీలేరు నియోజకవర్గం కలికిరి.. మాజీ మంత్రి గా పని చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు, ఆయన కుటుంబ సభ్యులు తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ హయాంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా జిల్లాను శాసించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు ఆయన చెప్పిందే చేసేలా మారిపోయింది. వైసీపీ ప్రభుత్వం భారీ ఓటమి చవి చూడడంతో పాటు చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి, కుమారుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తప్ప మరెవ్వరు గెలవలేదు. గెలుపులో, పరిపాలనలో పెద్దిరెడ్డి మార్క్ వేసుకున్నా ఓటమిలో మాత్రం ఆయన పాత్ర లేనట్టు వ్యవహరించారు. గత ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ, బీసీవై పార్టీల నాయకులు కాదు కనీసం పార్టీ జెండా కనిపించకుండా చేశారు. వైసీపీ పతనంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక మొత్తం తిరగబడింది. గతంలో వారు చేసిన పనులు నేడు కూటమి నాయకులు చేసి చూపిస్తున్నారు. పెద్దిరెడ్డి కుటుంబం పర్యటన అంటేనే అడ్డుకునేందుకు రోడ్ల పైకి వేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గంలో పర్యటించాలంటే కూడా దాడులు చేసే పరిస్థితి నెలకొంది. కుప్పం కాకుండా అంగళ్లు, తిరుపతిలో రాళ్ల దాడులు, బీసీవై పార్టీ నాయకులు బొడే రామచంద్ర యాదవ్ పుంగనూరు నియోజకవర్గం పర్యటనలో జరిగిన గొడవలు, పోలీస్ స్టేషన్‌లోకి దూరి మరీ దాడులు ఇలా అనేకం జరిగాయి. నాడు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొందరిపై కేసులు పెట్టారు. అసలైన వారిని విడిచిపెట్టారని కూడా ప్రచారం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో పర్యటించాలంటే అడ్డుకునేందుకు కూటమి నాయకులు సిద్ధం కావడంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోనే ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారుఆయన కుమారుడు ఒకసారి పుంగనూరు పర్యటనకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆ తరువాత ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మాజీ చిత్తూరు ఎంపీ రెడ్డప్ప ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు రెడప్ప ఇంటిపై రాళ్ల దాడులు, వాహనానికి నిప్పు పెట్టారు. తాజాగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డిను సైతం చంద్రబాబు నాయుడుపై రాళ్ల దాడులు జరిగిన అంగళ్ల ప్రాంతంలో వారు అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. ఇక ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఒక ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న, ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యే వస్తే రాళ్ల దాడి చేస్తామని గులక రాళ్లు పోగు చేసినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇది ఇలాగే కొనసాగితే రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంటు పరిధిలో ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు కాదు నాయకులు, కార్యకర్తలు తిరిగే పరిస్థితి ఉండదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


# తిరుమలలో కోఆపరేటివ్ ఎలక్షన్స్ హడావిడి



**తిరుమల :** తిరుమల అంటే శ్రీ వేంకటేశ్వర స్వామి... స్థానిక ఆలయాలు... తిరుపతి అందాల గురించి తెలుసు కానీ టీటీడీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. టీటీడీలో ఎన్నికలు ఏంటీ అని అనుకుంటున్నారా? తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం లక్షల మంది భక్తులు తరలివస్తారు. ఆ భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు టీటీడీ శాశ్వత ఉద్యోగులు... కాంట్రాక్టర్ ఉద్యోగులు... శ్రీ లక్ష్మి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఉద్యోగులు సుమారు 16వేల మంది పని చేస్తున్నారు. ఇలా వీరే కాకుండా పారిశుద్ధ్య కార్మికులు ఏజెన్సీ కూడా పని చేస్తుంటుంది. వీరంతా తిరుమల, తిరుపతిలోని టీటీడీ అనుబంధ కార్యాలయాలు, ఆలయాలు, విద్య, వైద్య కేంద్రాల్లో పని చేస్తున్నారు. టీటీడీలో ప్రస్తుతం 7వేల మంది శాశ్వత ఉద్యోగులు పని చేస్తున్నారు. గతంలో 16వేల మంది పని చేసే వారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సౌకర్యార్థం కో ఆపరేటివ్ సొసైటీ సహకారంతో టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ( టీటీడీ ఉద్యోగుల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ) 1939 జులై 7 న ప్రారంభించారు. ఎంప్లాయిస్ బ్యాంకుకు సంబంధించి పూర్వం 9 మందిని ఉద్యోగులు పాలకవర్గంగా ఎన్నుకునే వారు. అధ్యక్షుడిగా టీటీడీ ఈవో, అకౌంట్ ఆఫీసర్, వెల్ఫేర్ ఆఫీసర్ నామినేటెడ్ పదవుల్లో ఉండవాళ్లు. 6 మంది ఉద్యోగులను డైరెక్టర్లుగా సహచర ఉద్యోగులు (బ్యాంకు ఖాతా కలిగిన) వారు ఓటింగ్ విధానంలో ఎన్నుకునే వాళ్లు. ఇలా ఎన్నుకున్న పాలకవర్గం 5 సంవత్సరాల కాలం ఉంటుంది. క్రమంగా రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా కొన్ని నిబంధనలు మార్చారు. టీటీడీ ఈవో సైతం బ్యాంకు పాలకవర్గం నుంచి బయటకు రావడంతో ఆరుగురు ఉన్న డైరెక్టర్ల సంఖ్య 7కి పెంచి ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్ అమలు చేశారు. ఉద్యోగుల ద్వారా ఎన్నికైన ఏడుగురి డైరెక్టర్లు నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి, డైరెక్టర్లుగా కొనసాగుతారు. అకౌంట్ ఆఫీసర్, వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉంటారు. గతంలో 2019లో టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఎన్నికల జరిగాయి. నాటి పాలకవర్గం చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం ఎన్నికల సందడి టీటీడీలో నెలకొంది. జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల అధికారిణి కూడా పని ప్రారంభించారు. ఆమె అన్నింటిని పరిశీలించిన తర్వాత త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్యానల్ సభ్యులు పలువురు ప్రచారంలో దూసుకుపోతున్నారు. సుమారు 20 నుంచి 30 మంది సభ్యులు పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. టీటీడీ లాంటి సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఇప్పుడు ఎన్నికల బిజీలో ఉంటున్నారు.

# మళ్లీ బుడమేరు టెన్షన్

**విజయవాడ :** బుడమేరులో మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. పలుచోట్ల గండ్లు పడటంతో అధికార యంత్రాంగం వెంటనే అప్రమతమైంది. యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో? మంత్రి లోకేశ్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. బుడమేరులో వరద ఉధృతి పెరగటంతో విజయవాడ నగరంలోని ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ జక్కంపూడి, సింగ్ నగర్ ప్రాంతాలకు వరద నీరు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. శాంతినగర్ గండిని పూడ్చే పనులు ముమ్మరమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో బుడమేరు గండి పూడ్చే పనులను మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి లోకేశ్ పరిశీలించారు. అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేసి మొదటి గండి పూడ్చారు. గత ఐదేళ్లలో కనీస మరమ్మత్తుల పనులు కూడా చెయ్యకపోవడమే గండ్లు పడటానికి ప్రధాన కారణమని అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా గండ్లు పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష చేశారు. ఆ తర్వాత బుడమేరు గండి పూడ్చే పనులను డ్రోన్ లైవ్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి లోకేశ్ పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న మంత్రి నిమ్మల రామానాయుడుతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతమయ్యేలా చూస్తున్నారు. ప్రధానంగా 2,3 వంతెనల వద్ద పడిన గండ్ల నుంచే వరద నీరు అజిత్ సింగ్ నగర్లోకి ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో వీటిని పూడ్చి వేయడమే లక్ష్యంగా మొత్తం యంత్రాంగం అంతా పనిచేస్తోందని మంత్రి లోకేశ్ తెలిపవిజయవాడకు బుడమేరు చాలా సమస్యగా తయారైందన్నారు సీఎం చంద్రబాబు. చిన్న చిన్న వాగులన్నీ కలిసి బుడమేరు పెద్దదిగా మారిందని చెప్పారు. "బుడమేరును




గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అటు కృష్ణానది, ఇటు బుడమేరు రెండూ కలిసి విజయవాడను ముంచెత్తాయి. గత ఐదేళ్లపాటు ఏం చేశారని వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్నాం. వాగులను కబ్జా చేయడమే ఈ దుస్థితికి కారణం. ఆఖరికి పోలవరం కాలవలోనూ మట్టి తవ్వేశారు. ఇంత చేసి, ఇప్పుడు ఎదురు దాడి చేస్తున్నారు. బుడమేరు నీరు కొల్లేరు, కృష్ణానదికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. బుడమేరు ప్రవాహ దారిలో కాలువలు, వాగుల్లో కబ్జాలు తొలగిస్తాం. ఇలాంటి విపత్తులను అందరూ సమిష్టిగా ఎదుర్కోవాలి. వరద బాధితులు అందరికీ న్యాయం చేస్తాం" అని స్పష్టం చేశారు. ప్రైవేటు బోట్లు వాళ్ళు డబ్బులు వసూలు చేస్తే కేసులు పెడతామని చంద్రబాబు హెచ్చరించారు. అరెస్ట్ లు కూడా చేపిస్తామన్నారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు అధిక ధరకి అమ్మితే, కఠిన చర్యలు ఉంటాయన్నారు. రేపటి నుంచి ప్రభుత్వమే తక్కువ రేటుకి కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

# రామోజీ సిటీలోకి బుల్డోజర్లు వెళ్తాయా




**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమ సమయంలో రామోజీ ఫిలిం సిటీని 1000 నాగళ్ళతో దున్నుతానని కేసీఆర్ శపథం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు. పైగా మార్గదర్శి కేసులో జగన్ ఉరిమి వస్తుంటే.. రామోజీరావును జైలుకు వెళ్లకుండా కేసీఆర్ కాపాడారు..ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలోనూ నాగార్జున పై కేసీఆర్ ఇదే స్థాయిలో ఉదారత చూపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాదులో ఆక్రమణలను పడగొడుతోంది. చెరువులు, బఫర్ జోన్లలో నిర్మించిన నిర్మాణాలను కూల్చేస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరంలో హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. ఇప్పటికే పాలు చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను పడగొట్టింది. నిర్మాణంలో ఉన్న కట్టడాలను నేల కూల్చింది. భవిష్యత్తులోనూ చెరువులను, కుంటలు, నాలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. సాక్షాత్తు దీనిని ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో హైడ్రా దూకుడును అడ్డుకునేవారు కనిపించడం లేదు. పైగా దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరికొత్త విజ్ఞప్తులు హైడ్రా ముందుకు వస్తున్నాయి. హైదరాబాద్ నగర పరిధిలోని కబ్జాకు గురైన చెరువులు, నాయకులు నిబంధనలను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాల వివరాలను హైడ్రా దృష్టికి పలువురు తీసుకొస్తున్నారు. ఇందులో ఎక్కువగా బడా బాబులకు చెందిన నిర్మాణాలే ఉన్నాయి. అయితే వాటిపై హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటున్ననేది ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో హైదరాబాద్ నగరానికి మణిహారంగా మారిన రామోజీ ఫిలిం సిటీపై తెరపైకి సరికొత్త ఆరోపణలు వస్తున్నాయి.రామోజీ ఫిలిం సిటీపై ఆరోపణలు కొత్త కాదు. అసైన్డ్ భూములు ఆక్రమించి ఫిలిం సిటీని నిర్మించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కొంతమంది పేదలకు ఆ భూములను పంపిణీ కూడా చేశారు. వీటిపై అప్పట్లో శంకర్రావు, గోనె ప్రకాష్ రావు వంటి వారు కోర్టులను ఆశ్రయించారు. రామోజీ ఫిలిం సిటీ విస్తరించిన ప్రాంతంలో చెరువులు ఉన్నాయట. రామోజీరావు నివసించిన భవనం పక్కనే అతిపెద్ద నాలా ఉందట. దానిని ఆక్రమించి భారీ నిర్మాణం చేపట్టారట. ఈ విషయాన్ని ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన ముఖాముఖిలో ఓ సామాజికవేత్త బయటపెట్టారు. తెలంగాణ హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే ఆ నిర్మాణాలను కూడా పడగొట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతమైన వ్యాప్తిలో ఉంది. ఈ వీడియో ప్రసారమవుతుండగానే రామోజీ ఫిలిం సిటీ లో ఉన్న చెరువులను చూపిస్తుండడం విశేషం. మరి దీనిపై తెలంగాణ హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది. మరోవైపు తెలంగాణ హైడ్రా చేస్తున్న పనులను ఈనాడు అభినందిస్తోంది. హైదరాబాద్ నగరాన్ని ఆక్రమణలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరుతోంది. మరి ఇదే స్ఫూర్తిని తన ఫిలిం సిటీ లోని చెరువులను పరిరక్షించేందుకు ప్రయోగించాలని కోరుతుందా? హైడ్రా తీసుకునే చర్యలకు సమ్మతం తెలుపుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.


# రాజకీయాల్లో సరిపోదా శనివారం

**హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజులు కనీవిని ఎరుగని రీతిలో వర్షాలు కురిశాయి. దీంతో రెండు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ అతలాకుతలమైంది. తెలంగాణలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు సమస్థితిని పునరుద్ధరించే పనిలో పడ్డారు. బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. తెలంగాణలో మృతులతోపాటు, రైతులకు సాయం ప్రకటించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ క్రమంలో ఊహించిన పరిణామంలో, నాని యొక్క సరిపోద శనివారం తెలంగాణాలో రాజకీయ చర్చకు దారితీసింది. బీఆర్ఎస్ దీనిపై అసాధారణమైన వాదనను చేసింది. తెలంగాణ వరదలతో అతలాకుతలం అవుతుంటే సీఎం రేవంత్ రెడ్డి సరిపోద శనివారాన్ని చూస్తున్నారని కేసీఆర్, కేటీఆర్‌ల నమ్మకస్తుడు, బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ ఆరోపించారు.గత శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిశాయి. నదులు పొంగాయి. వరద పరిస్థితి మరింత దిగజారింది. ఈ సమయంలో తెలంగాణ సీఎం ఎక్కడ ఉన్నారు? అతను తన కుటుంబంతో కలిసి తన ఇంట్లో కూర్చుని సరిపోద శనివారం సినిమా చూస్తున్నాడు అని బాల్క సుమన్ ఆరోపించారు. తెలంగాణ వరదలు ముంచెత్తుతున్న సమయంలో ఆయన తన ఇంట్లో సినిమా చూసే పనిలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. ప్రజలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. కష్టసమయంలో అండగా ఉండాల్సిన సీఎం.. కుటుంబంతో ఎంజాయ్ చేశాడని విమర్శించారు.ఇదిలా ఉంటే



సరిపోద శనివారం గత వారాంతంలో మాత్రమే థియేటర్లలో విడుదలైంది. ఇది స్పష్టంగా ఓటీటీలోకి రాలేదు. కాబట్టి, రేవంత్ తన ఇంట్లో సినిమా చూడటం వెనుక లాజిక్ ఏంటని ఎవరైనా ఆశ్చర్యపోవచ్చు. దీని అర్థం బీఆర్ఎస్ మాజీ ఎంపీ బాల్క సుమన్ కేవలం నాని నటించిన చిత్రాన్ని ఉపయోగించి బ్లఫ్ చేస్తున్నారు. కాగా, తమ రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ యంత్రాంగం, సహాయక సిబ్బంది ప్రయత్నాలను అవమానపరిచారంటూ రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ క్యాంపుపై ఫైర్ అవుతున్నారు. అమెరికాలో కులుకుతున్న నేతలు కూడా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు.ప్రజలు వరదలతో అల్లాడుతుంటే.. అమెరికాలో ఉన్న కేటీఆర్ స్పందిస్తున్నాడు కానీ, తెలంగాలణలో ఉన్న కేసీఆర్ కనీసం నోరు మెదపడం లేదు. దీనిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ చేశారు. తాము ప్రశ్నించిన తర్వాతనే మాజీ మంత్రి హరీశ్‌రావు వరద బాధిత ప్రాంతాల పర్యటన చేపట్టారని విమర్శించారు. ప్రజలకు అండగా నిలవాలన్న సోయి విపక్ష నేతలకు లేదని మండిపడ్డారు.

# తాడ్వాయి ఫారెస్ట్ విచారణ షురూ



**వరంగల్ :** ములుగు జిల్లా తాడ్వాయి, పస్రా ఫారెస్ట్ రేంజ్ లో ఏకంగా 200 హెక్టార్లలో చెట్లు నేల మట్టం కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో ఎంతటి భారీ వర్షాలు కురిసినా అటవీ ప్రాంతాలు ప్రభావితమైన దాఖలాలు చాలా తక్కువే. కానీ ఇప్పుడు కురిసిన వర్షాలకు చిన్న, పెద్ద వృక్షాలు అన్ని కలిపి 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ ఏరియా భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రాష్ట్రంలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. కాగా ములుగు జిల్లాలో కూడా వర్ష ప్రభావం ఉండగా.. అది ఫారెస్ట్ ఏరియాపై ఎక్కువ కనిపించింది. ఏకంగా 200 హెక్టార్లలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం అయ్యాయంటే మామూలు విషయం కాదు. అటవీ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అసలు ఫారెస్ట్ ఏరియాలో ఇంత పెద్ద ఎత్తున చెట్లు కూలిపోవడంపై విచారణకు ఆదేశించారు.ఈ మేరకు వరంగల్ సీసీఎఫ్ ప్రభాకర్, ములుగు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రాహుల్ కిషన్ జాదవ్, ఇతర అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం ఒక దఫా ఎంక్వైరీ చేసి, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. చెట్లు నేలకూలిన ప్రదేశాన్నంతా కలియ తిరిగారు. ఒక్క గాలివానకే ఇంత పెద్ద నష్టం జరగడం ఇదే తొలిసారి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంగళవారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టగా.. బుధవారం టెక్నికల్ టీమ్ అధికారులు కూడా అటవీ ప్రాంతాన్ని సందర్శించి నివేదిక తయారు చేయనున్నట్లు తెలిసింది.అటవీ ప్రాంతం నేలమట్టం కావడంపై ఫారెస్ట్ అధికారులు శాస్త్రీయ కారణాలను అన్వేషించే పనిలో పడ్డారు. ఈ మేరకు చెట్లు కూలిపోయిన ప్రదేశంలో మట్టి శాంపిల్స్ సేకరించారు. దాదాపు మూడు మీటర్ల లోతులో నుంచి మట్టి శాంపిల్స్ తీసుకుని, వాటిని ల్యాబ్‌కు పంపి పరీక్షించే పనిలో పడ్డారు. చెట్లు నేల కూలడానికి అసలు కారణాలు ఏంటి.. అక్కడి నేల స్వభావం ఏమైనా మారిందా.. లేదా ఇందులో కుట్ర ఏమైనా దాగి ఉందా.. అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల కిందటే మట్టి శాంపిల్స్ కు పంపించగా.. అక్కడి నుంచి వచ్చే రిపోర్ట్ ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఒక వేళ నేల స్వభావం మారితే ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అటవీ ప్రాంత రక్షణ కోసం తగిన చర్యలు చేపట్టనున్నట్లు అటవీ శాఖ సిబ్బంది వివరించారు.వనదేవతలు సమ్మక్క-సారక్కల దయవల్లనే ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదని మంత్రి సీతక్క అన్నారు. ఈ గాలి విధ్వంసం గ్రామాల్లో జరిగి ఉంటే భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండేదని అన్నారు. అమ్మ దయ వల్లే ప్రమాదం తప్పిందని చెప్పారు. ఆ తల్లుల దీవెనతోనే ప్రజలు సురక్షితంగా బయట పడగలిగారని అన్నారు. ఈ ఘటనపై కేంద్రం కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. కేంద్రం నుంచి పరిశోధన టీంలు రప్పించి కారణాలు గుర్తించాలన్నారు. అటవీ ప్రాంతంలో చెట్లను పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఇక పెను విధ్వసంతో చెట్లు నేలకొరగటంపై అటవీ శాఖ అధికారులు ఇప్పటికే విచారణ మె?దలు పెట్టారు. గాలులు వీచిన విధానంపై.. జరిగిన విధ్వంసంపై వారు సైంటిఫిక్ రీసెర్చ్ చేస్తున్నారు. రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహకారంతో విధ్వంసానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. త్వరలోనే ఈదురు గాలులు చోటు చేసుకోవటానికి గల కారణాలు తెలుస్తాయని అధికారులు అంటున్నారు.

# విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం - పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి, సెప్టెంబర్-5 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ , జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ , అదనపు కలెక్టర్ రెవెన్యూ జి శ్యాంప్రసాద్ లాల్ లతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ముఖ్యఅతిథిగా విచ్చేసిన పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ తాను ఇంతగా ఎదగడానికి గురువులు నేర్పిన విద్యాబుద్ధుల కారణమని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి హోదా వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని, మారుమూల ప్రాంతాల్లో విద్యార్థు తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ అవార్డు వచ్చిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు ఈ పాఠశాల నాది ఈ విద్యార్థులు నా వారు అన్న భావనతో పనిచేసినప్పుడు విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు 12 వందల కోట్ల రూపాయలు వెచ్చిచ్చిందని అన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్న ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సింగరేణి ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి నోట్ బుక్స్ అందించడం జరుగుతుందని అన్నారు. మహిళ ప్రభుత్వ జూనియర్ కళాశాలను రెండు కోట్ల రూపాయలతో మరమ్మత్తులు చేయడం జరుగుతుందని అదేవిధంగా జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని పెద్దపెల్లి ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు మరియు జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందించారు, మన జిల్లాలో ఉపాధ్యాయులు చాలా బాగా పనిచేస్తున్నారని అదేవిధంగా మునుముందు కూడా ఇలానే పనిచేయాలని కోరారు జిల్లా యంత్రాంగం ద్వారా పాఠశాలకు కావలసిన మౌలిక వసతులు కల్పించగలము కానీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వయస్సు వారి విద్యా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, దేశంలో ప్రతి ఒక్క వ్యక్తి చదువుకోవాలి, చదువులో రాణించాలని, అత్యున్నత స్థాయిలో దేశాన్ని నడిపించాలని డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయమని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు తమ వృత్తిలో రాణించాలంటే వృత్తిపట్ల శ్రద్ధ విద్యార్థులకు సులువుగా వేసే విధంగా విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు చిన్న వయసు నుంచి మంచి అలవాట్లు నేర్పించాలని, నూతన విధానంలో విద్యాబోధన చేయాలని, చదువుతోపాటు క్రీడల్లో సైతం విద్యార్థులు పాల్గొనే దిశగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 42 మంది ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు.

# తెలంగాణలోనూ...కనిపించని కమలం నేతలు



**హైదరాబాద్:** తెలంగాణ భారతీయ జనతా పార్టీ నాయకులు అసలైన విషయాలపై స్పందించడం లేదు. ముఖ్య నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ పరిమామం వల్ల అసలు బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. తాజాగా వరదల విషయంలో కేందాన్ని కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసింది. అవసరమైన హెలికాప్టర్లు, పవర్ బోట్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించలేదని ప్రజల్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటిని తెలంగాణ బీజేపీ నేతలు కూడా తిప్పికొట్టలేకపోతున్నారు. మామూలుగా అయితే ఏ రేంజ్ లో కావాలంటే ఆ రేంజ్‌లో ఎదురుదాడి చేయవచ్చు . కానీ ఎవరికి వార తమకెందుకు అనుకుంటున్నారు. అందు వల్లే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖమ్మంకు ఆ స్థాయిలో వరద వస్తుందని ప్రభుత్వం ఊహించలేకపోయింది. బుడమేరు విజయవాడను ముంచింది కాబట్టి... ఆ నీరు ఖమ్మం వైపు వస్తుందని అంచనా వేయలేకపోయారు. చివరికి మున్నేరు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. ఆరేడు అడుగుల ఎత్తున నీరు పారడం అంటే చిన్న విషయం కాదు. మామూలుగా అయితే గోదావరికి వరదలు వస్తే.. ఖమ్మం జిల్లా ఉలిక్కి పడుతుంది. ఈ సారి మాత్రం భిన్నం. అందుకే ప్రభు?తవం పెద్దగా చర్యలు తీసుకోలేకపోయింది. కేంద్రాన్ని కూడా అప్పటికప్పుడు అడిగి ఎలాంటి డిజాస్టర్ రిలీఫ్ చేపట్టలేకపోయింది. హెలికాప్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. తర్వాత రోజే రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు వెళ్లినప్పటికీ.. ప్రభుత్వం పెద్దగా ఏమ చేయలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. ఖమ్మంలో ఎలాగూ వైఫల్యం చోటు చేసుకుంది..దాని కారణాన్ని కేంద్రంపై నెట్టేస్తే బెటరనుకుని ఆ పని ప్రారంభించారు. విపత్తు వచ్చినా కేంద్రం కనీసం హెలికాప్టర్ల పంపలేదని.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపలేదని ఆరోపణలు చేయడం ప్రారంభించారు. పక్కన ఉన్న రాష్ట్రానికి 120 పవర్ బోట్లు, హెలికాప్టర్లు, ఎయిర్ ఫోర్స్ కూడా సాయానికి వెళ్లిందని తెలంగాణకు ఒక్కరు కూడా రాలేదని అది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమేనని బీఆర్ఎస్ విమర్శించింది. అయితే ఇది బీజేపీకి సూటిగా తగిలింది. బీజేపీని ఏమీ అనలేని నిస్సహాయత వల్ల కాంగ్రెస్ ను కేటీఆర్ విమర్శించి ఉండవచ్చు కానీ.. కేంద్రం ఏమీ చేయలేదంటే అది బీజేపీ మీదకే వెళ్తుంది. తమపై వస్తున్న విమర్శలకు బీజేపీ కౌంటర్ చేయలేకపోతోంది. దీనికి కారణం సమాధానం లేకపోవడం కాదు. నేతలు పెద్దగా పట్టించుకోకపోవడమే. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒక్క లీడర్ కూడా బాధ్యత తీసుకోవడం లేదు. ఫలితంగా బీజేపీపై వచ్చిన విమర్శలు మరకలుగానే పడిపోతున్నాయి. ఎవరికి వారు సొంత ఎజెండా ప్రకారం స్పందించాల్సి వచ్చినప్పుడు స్పందిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్ర బీజేపీ కూడా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ నేతల్ని అలా వదిలేశారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# నీట మునిగిన పాలమూరు పంప్ హౌస్




**మహబూబ్ నగర్ :** దక్షిణ తెలంగాణకు వరదాయని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్. ఎన్నో ఏళ్లుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. అయితే, వరదల నేపథ్యంలో ప్రాజెక్ట్‌లో భాగమైన కుమ్మెర వద్ద ఉన్న వట్టెం పంప్‌హౌస్ నీటమునిగింది. ప్యాకేజీ 7లోని ఆడిట్ నుంచి పంప్‌హౌస్ సొరంగ మార్గంలోకి వరద నీరు ఒక్కసారిగా వచ్చింది. నాగనూలు, నాగర్ కర్నూల్ చెరువుల నుంచి భారీగా వరద ప్రవాహం రావడం వల్లే ఇది జరిగింది. సుమారు 18 నుంచి 20 కిలోమీటర్ల మేర సొరంగ మార్గంలో వరద నీరు నిలిచిపోయింది.కొద్ది రోజులుగా నాగర్ కర్నూల్ జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. చెరువులు ఫుల్ అయ్యాయి. శ్రీపురం, తూడికుర్తి, నాగనూలు చెరువులు అలుగు పారుతున్నాయి. వీటి సమీపంలో పీఆర్ఎల్ఐ పథకం టన్నెల్ ఉంటుంది. ఈ నేపథ్యంలో చెరువుల నుంచి వరద నీరు సర్జిపూల్‌లోకి వచ్చి గేట్ల ద్వారా పంప్‌హౌస్‌లోకి చేరింది. ఈ పంప్‌హౌస్‌లో 10 మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా 4 మోటార్లను ఏర్పాటు చేశారు. ఇంకో మోటార్ నిర్మాణ దశలో ఉంది. ఈ సమయంలో వరద నీరు ముంచెత్తడంతో మోటార్ల పరిస్థితి ఏంటనే డౌట్ సర్వత్రా వ్యక్తమవుతోంది.కేసీఆర్ హయాంలో గోదావరికి వరద పోటెత్తిన సమయంలో ప్రతిష్టాత్మక కాళేశ్వరం పంప్‌హౌస్‌లు మునిగాయి. కన్నెపల్లి, అన్నారం పంప్‌హౌస్‌ల్లోకి వరద నీరు ముంచెత్తింది. అంతేకాదు, మేడిగడ్డకు వెళ్లే విద్యుత్ సరఫరా వ్యవస్థ కూడా కుప్పకూలింది. 2022 జులైలో జరిగిన ఈ ఘటనపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రాజెక్ట్ నాణ్యత విషయంలో అనుమానాలకు తావిచ్చింది. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో రక్షణ గోడ కూలిపోవడంతో మోటార్లు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగంగా కడుతున్న వట్టెం పంప్‌హౌస్‌లోకి వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో పంప్‌హౌస్‌ల పరిస్థితిపై చర్చ జరుగుతోంది.పక్కనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నా, వాడుకోలేని పరిస్థితి ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ వాసులది. నదికి చాలా ఎత్తులో ఉండడమే ఇందుకు కారణం. కృష్ణా నదిలో మిగులు, వరద నీటిని వాడుకునేందుకు, మోటార్ల సాయంతో ఎత్తిపోసే ప్లాన్ చేసింది ప్రభుత్వం. దానికే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌గా నామకరణం చేసి పనులు మొదలు పెట్టింది. ఈ ప్రాజెక్ట్ లో ఐదు పంప్‌హౌస్‌లు ఉంటాయి. ఆరు రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతోంది. వీటి ద్వారా 67 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేయాలనేది ప్లాన్. ఐదు పంప్‌హౌస్‌ల్లో 34 మోటార్లను పెడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, నారాయణ్‌పేట, రంగారెడ్డి వికారాబాద్, నల్గొండ జిల్లాలకు సాగు, తాగు నీరు అందుతుంది.

# నోటిలో అధిక లాలాజలం ప్రవించడానికి కారణాలివే, ఈ జాగ్రత్తలు తీసుకుంటే సరి

సామాజిక ఆందోళనలతో కూడుకుని అసహనం ఎక్కువగా కలిగి ఉండేవారు ఎక్కువ స్థాయిలో లాలాజలం ఉత్పత్తి చేయడం జరుగుతుందని చెప్పబడింది. దీనికి భయం, అసహనం, అసౌకర్యం మొదలైన అంశాలు తోడు కావొచ్చు. హైపర్సలైవేషన్ (లాలాజలం అధికంగా ఉత్పత్తి అవడం) కారణంగా మీ నోటి దిగువ పెదవుల నుండి లాలాజలం బయటకు వచ్చేలా చేస్తుంది. సహజంగా చొంగ కారడం అని వ్యవహరిస్తుంటారు. పరిస్థితులను అనుసరించి, హైపర్సాలైవేషన్ అనేది శాశ్వతంగా, లేదా తాత్కాలికమైనదిగా ఉంటుంది. ఈ కారణాన్ని గుర్తించడం ద్వారా రోగులకు ఉత్తమమైన చికిత్సను అందివ్వవచ్చు. ఇది నలుగురితో మాట్లాడడానికి ఇబ్బందిని కలిగించడమే కాకుండా, వేరే ఇతర అనారోగ్య పరిస్తితులకు కూడా దారితీస్తుంది. ముఖ్యంగా రోజువారీ కార్యకలాపాలలో తీవ్ర అడ్డంకిగా మారే అవకాశాలు ఉన్నాయి. హైపర్సాలైవేషన్ అంటే ఏమిటి ? హైపర్సాలివేషన్ అనగా లాలాజలం అధిక స్రావానికి గురవడం. ప్రత్యేకించి ఒక వ్యాధిగా పరిగణించకపోయినా కూడా, హైపర్సాలైవేషన్ ఒక రకమైన అంతర్లీన పరిస్థితికి చిహ్నంగా పరిగణించబడుతుంది. వ్యయ ప్రయాసలు లేకుండానే చికిత్స తీసుకునేలా ఉంటాయి. కానీ చికిత్సను తీసుకొని ఎడల, ఇతరులు మీతో మాట్లాడేందుకు కూడా సుముఖత వ్యక్తం చేయని పరిస్థితులు దాపురిస్తుంటాయి. పరిస్థితి చేయి దాటినప్పుడు మాత్రమే, వైద్యుడు శస్త్ర చికిత్సను సూచించవచ్చు. లాలాజల గ్రంధుల ద్వారా మన నోటిలోకి ప్రవించబడే స్పష్టమైన ద్రవంగా లాలాజలం కనిపిస్తుంది. ఆహారాన్ని నమిలేందుకు, అనుకూల వాతావరణాన్ని నోటిలో కలుగజేసేందుకు లాలాజలం ఉత్తమంగా సహాయపడుతుంది. లాలాజలంలోని ఎంజైముల ఉనికిని జీర్ణక్రియలో సహాయపడుతాయి. నోటి నుండి క్రిములను తొలగించడంలో కూడా లాలాజలం ఉత్తమంగా పనిచేస్తుంది. ఇది నోటి గాయాల చికిత్సలో కూడా సహాయపడుతుంది. అంతేకాకుండా విషానికి మరియు చికాకులకు వ్యతిరేకంగా ఒక అవరోధం వలె పనిచేస్తుంది కూడా. లాలాజలం నోరు పొడిబారకుండా చూడడంలో సహాయం చేస్తుంది. ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి లాలాజల ఉత్పత్తి, సగటున 0.75 నుండి 1.5 లీటర్లు. ఆహారం తీసుకునేటప్పుడు, దీని ఉత్పత్తి శిఖరాగ్ర స్థాయిలో ఉంటుంది. అదేవిధంగా మనం నిద్రపోతున్న సమయంలో అతి తక్కువగా ఉంటుంది. మీరు అధిక లాలాజల ఉత్పత్తితో బాధ పడుతున్న ఎడల, మాట్లాడటం మరియు తినడం కూడా కష్టంగా ఉంటుంది. హైపర్సలైవేషన్ చర్మ వ్యాధులకు, పెదాలపై పూతలు, పుండ్లు ఏర్పడడానికి కూడా కారణమవుతుంది. ఎక్కువ మోతాదులో చొంగ కారడం కారణంగా సామాజికంగా ఆత్మ విశ్వాసం దెబ్బతినడానికి కూడా కారణం అవుతుంది. హైపర్సాలైవేషన్ యొక్క కారణాలు :మితిమీరిన లాలాజల ఉత్పత్తికి ప్రాథమిక కారణాలు :గర్భంగర్భధారణ సమయంలో మార్నింగ్ సిక్నెస్ మరియు వికారం వంటి సమస్యలు అధిక లాలాజల ఉత్పత్తికి కారణమవుతుంది. గర్భాశయ హార్మోన్లు మీ లాలాజల గ్రంథుల పనితీరుని సైతం ప్రభావితం చేయగలవు. గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి :ఎసోఫాగియల్ లైనింగ్లో, నిరంతరంగా రిఫ్లక్స్ జరగుతున్న ఎడల, క్రమంగా ఈపరిస్థితి హైపర్సాలైవేషన్ ప్రేరేపిస్తుంది. అటువంటి సందర్భాలలో, దీనిని నీటి గొలుసుగా పిలవడం జరుగుతుంది. నోటిలో ఉత్పత్తి జరిగే లాలాజలం ఏమాత్రం రుచి లేకపోవడం లేదా పుల్లటి రుచి



అనుభవానికి లోనుచేయడం జరుగుతుంటుంది. అధిక పిండి పదార్ధాలు తీసుకోవడం :అధిక పిండి పదార్ధాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం కూడా మీ నోటిలో లాలాజలం ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ప్యాంక్రియాటైటిస్ :ఇది లాలాజల గ్రంధులు పూర్తిస్థాయిలో పనిచేయకపోవటానికి కారణం కావచ్చు. అనేక సంవత్సరాల పాటు మద్యపానం అధికంగా తీసుకోవడం మూలంగా ప్యాంక్రియాటైటిస్ సమస్యకు కారణమవుతుంది. నోటి అల్సర్స్ ( పుండ్లు ) :నోటిలో పుండ్లు ఉన్నప్పుడు మరింత ఎక్కువగా లాలాజల ఉత్పత్తి జరుగుతుంది. అనగా, బాధాకరమైన నోటి పూతల విషయంలో హైపర్సలైవేషన్ ఖచ్చితంగా ఉంటుంది. క్రమంగా అటువంటి పుండ్ల లక్షణాలు సాధారణంగా పులిసిన భావనని కలిగిస్తుంటాయి. క్రమంగా ఆ ప్రాంతంలో ఎర్రటి బంప్ వలె ఏర్పడుతుంది కాలేయ వ్యాధిలాలాజల స్రావం అనేది స్వయం ప్రతి నాడీ వ్యవస్థ ద్వారా నియంత్రించబడుతుంది. కాలేయ వ్యాధి అధిక లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఓరల్ ఇన్ఫెక్షన్లు :నోటి మంట లేదా వాపుతో కూడిన ఇన్ఫెక్షన్లు అధిక లాలాజల స్రావానికి దారితీస్తుంది. టాన్సలిటిస్ వంటి ఓరల్ ఇన్ఫెక్షన్లు హైపర్సలైవేషన్ సమస్యకు కారణమవుతాయి. నోటిలో హెర్పెస్ వంటి వైరల్ సంక్రమణ రూపంలో కూడా ఓరల్ ఇన్ఫెక్షన్లు ఉంటాయి. హెర్పెస్, నోటి చుట్టూ వాపు మరియు పుండ్లు ఏర్పడడానికి కారణమవుతుంది. సెరోటొనిన్ సిండ్రోమ్ఇది నాడీ వ్యవస్థలో అధిక సెరోటోనెర్జిక్ చర్యలను సూచించే లక్షణం కలిగిన ప్రాణాంతకమైన వ్యాధిగా చెప్పబడింది. ఈ స్థితిలో, రోగి మానసిక స్థితిలో మార్పులను ఎదుర్కోవలసి ఉంటుంది. ముఖ్యంగా న్యూరోమస్కులర్ హైపర్ యాక్టివిటీ మరియు ఆటోనామిక్ అస్థిరతలను (మానసిక జాఢ్యం) ఎదుర్కొంటుంది. ఇటువంటి నరాల లక్షణాలు ఉన్న రోగులలో, హైపర్సలైవేషన్ అనేది చాలా సాధారణమైన అంశంగా ఉంటుంది. హైపర్సాలివేషన్ నిర్ధారణ ఎలా జరుగుతుంది ? అన్నిటికన్నా ముఖ్యమైనది వ్యాధి నిర్ధారణ. దీనికి అంతర్లీన అనారోగ్య పరిస్థితులు కూడా కారణంగా మారవచ్చు, మరియు వాటికి సంకేతంగా కూడా ఉండవచ్చు. కొన్ని అరుదైన సందర్భాల్లో, అధిక లాలాజల ఉత్పత్తి కారణాలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను సూచిస్తాయి. హైపర్సలైవేషన్ సమస్యను గుర్తించడానికి మీ వైద్యుడు ఈ క్రింది వాటిని పరిశీలించడం జరుగుతుంది : మీ దంతాలు, నోరు మరియు పరిసర చర్మం మీ మ్రింగే సామర్థ్యం, నాలుక నియంత్రణ మరియు దవడ స్థిరత్వం తల భంగిమ చురుకుదనం మరియు భావోద్వేగ స్థితిమీ వైద్యుడు మరికొన్నిఇతర వివరాలను కూడా అడుగువచ్చు, వాటిలో కొన్ని దిగువ పేర్కొనబడ్డాయి. హైపర్సలైవేషన్ సంభవించే అవకాశం ఉన్నప్పుడు, పరిస్థితి వ్యవధి మరియు సమయం మీరు వాడుతున్న మందుల వివరాల గురించి అడుగవచ్చు. ఒక్కోసారి మందుల ప్రతికూలతలు శాతం సమస్యకు కారణంగా ఉండవచ్చు. ఉత్పత్తి చేసే అదనపు లాలాజలం మొత్తం పరిస్థితి కొనసాగే సమయం రోజువారీ జీవితంలో హైపర్సాలివేషన్ యొక్క ప్రతికూల ప్రభావాలుహైపర్సలైవేషన్ కారణాన్ని గుర్తించిన తర్వాత, మీ వైద్యులు మీకు చికిత్సను ఖరారు చేసే ముందు, క్రింద పేర్కొన్న విధంగా, కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. వ్యక్తి మానసిక స్థితి మరియు రోగి వయస్సు పరిస్థితి యొక్క చిక్కులు మరియు తీవ్రత మెరుగుదల అవకాశాలు మరియు పరిధి నరాల సంబంధిత పరిస్థితుల గురించిన అవగాహన దీర్ఘకాలిక లేదా తాత్కాలిక హైపర్సలైవేషన్ హైపర్సాలివేషన్ చికిత్స ఎలా ? అంతర్లీన పరిస్థితికి చికిత్స అవసరం ఉంటుంది. ఈ పరిస్థితిపై ఆధారపడి, ఈ క్రింద సూచించబడిన వాటిలో ఏ చికిత్సనైనా చేయవచ్చు : చికిత్స :స్పీచ్ థెరపీ చికిత్స మరియు ప్రవర్తనా సరళి సవరణా చికిత్స ప్రధానంగా ఉంటుంది. ఔషధ ప్రయోగం :లాలాజలం ఉత్పత్తిని తగ్గించడానికి యాంటి ఖోలినెర్జిక్ మందులను సూచించబడతాయి. గృహ నివారణలు :పుష్కలంగా నీటిని తాగడం లాలాజల ఉత్పత్తిని తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. మౌత్ వాష్ ఉపయోగించి నోటిని శుభ్రపర్చడం తాత్కాలికంగా నోటిని పొడిగా ఉంచడంలో సహాయపడుతుంది. కొన్ని అరుదైన మరియు విపత్కర పరిస్థితుల్లో, శస్త్రచికిత్స కూడా హైపర్సలైవేషన్ వెనుక ఉన్న కారణానికి, చికిత్స చేయడానికి చివరి మార్గంగా ఉండవచ్చు. మరియు ఏకైక కారణం కూడా అదే కావొచ్చు. కావున పరిస్థితి చేయి దాటకుండానే వైద్యుని సంప్రదించడం మేలు. ఈ వ్యాసం మీకు నచ్చినట్లయితే మీ ప్రియమైన వారితో పంచుకోండి. ఇటువంటి అనేక ఆసక్తికర, ఆరోగ్య, జీవన శైలి, ఆద్యాత్మిక, జ్యోతిష్య, ఆహార, వ్యాయామ, లైంగిక తదితర సంబంధిత విషయాల కోసం బోల్డ్స్కై పేజీని తరచూ సందర్శించండి.

# మౌత్ వాష్ ను ఉపయోగిస్తే లాభమా? నష్టమా? తెలుసుకోండి మరి



: నోటిని శుభ్రపరచుటలో మౌత్ వాష్ ఎంతవరకు అవసరం ?, మౌత్ వాష్ వలన కలిగే ఉపయోగాలు మరియు దుష్ప్రభావాలు ఎలా ఉంటాయి ?, మౌత్ వాష్ నిజంగా నోటిలోని బాక్టీరియాను, క్రిములను చంపుతుందా ? వంటి అంశాల గురించిన పూర్తి వివరాలను తెలుసుకోవడంలో ఈ వ్యాసం దోహదం చేస్తుంది. మొత్తం ఆరోగ్యానికి నోటి పరిశుభ్రత కీలకమైన పాత్ర పోషిస్తుంది అనడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని సామెత, అలాగే నోరు శుభ్రంగా ఉంటే శరీరం కూడా అనారోగ్యాలపాలు కాకుండా ఉంటుంది. మౌత్ వాష్ యొక్క ప్రాముఖ్యత మరియు దాని ఆవశ్యకత గురించిన పూర్తి వివరాలు మీకోసం. మౌత్ వాష్, కావిటీస్ కలిగించే క్రిములతో వ్యతిరేకంగా పోరాడే, పోరాట సామర్థ్యాలను కలిగి ఉంటుంది. కొన్ని మౌత్ వాష్లు ఫ్లోరైడ్ ద్వారా, క్రిములను నాశనం చేయడంలో ప్రయోజనాన్ని అందిస్తాయి. అయితే కొన్ని మాత్రం దంతాలపై ఫలకాల ఆకృతిని నిరోధించే క్రిములను అడ్డుకోవడంలో సహాయాన్ని అందివ్వగలవు. కానీ, అధిక ఆల్కహాల్ కంటెంట్ కలిగిన, మరియు బలమైన యాంటీబాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉన్న మౌత్ వాష్లు, వాటి అధిక ఘాడత తత్వాల కారణంగా నోటి లోపలి కణజాలాలను అసౌకర్యానికి గురిచేయగలవు. కొందరు మధ్యవయస్కులపై, మౌత్ వాష్ ఉపయోగాలు మరియు దుష్ప్రభావాల గురించిన అవగాహన కోసం శాస్త్రీయ ప్రయోగాలు జరపడం కూడా జరిగింది. ప్రజలలో మౌత్ వాష్ వినియోగం గురించిన అపోహలను తొలగించుట, ఈ పరిశోధన వెనుక ఉన్న ఆలోచనగా చెప్పబడింది. ఆరోగ్యకరమైన చిగుళ్ళు మరియు దంతాల కొరకు మౌత్ వాష్ వినియోగానికి సంబంధించి అనేక దురభిప్రాయాలు, అపోహలు హల్చల్ చేస్తున్నాయి. కానీ మౌత్ వాష్ వినియోగాన్ని నిర్ణయించడానికి, నోటి పరిశుభ్రత కీలకపాత్ర పోషించినట్లు అధ్యయనాలు పేర్కొన్నాయి. పైగా మౌత్ వాష్ వాణిజ్య ప్రకటనలు కూడా మౌత్ వాష్ వినియోగించకుండా పూర్తి నోటి పరిశుభ్రతను సాధించడం కుదరదు అని ప్రజల్లోకి చేరేలా ప్రయత్నిస్తున్నాయి. ఈ నమ్మకం గురించిన మరిన్ని వాస్తవాలను తెలుసుకోవడానికి ఈ వ్యాసం దోహదపడుతుంది. మౌత్ వాష్ ను ఉపయోగిస్తే లాభమా? నష్టమా? తెలుసుకోండి మరి మౌత్ వాష్ ఎలా పనిచేస్తుంది? ఒక మౌత్ వాష్ అనేది రిన్సింగ్(పుక్కిలించడం)తో సమానంగా చెప్పవచ్చు, కానీ ఇది మీ రోజువారీ నోటి పరిశుభ్రతలో భాగంగా, బ్రష్ చేయడం మరియు రెండుసార్లు ఫ్లాసింగ్ వంటి చర్యలను భర్తీ చేయలేదు. నిజానికి, నోటి దుర్వాసనను పోగొట్టే క్రమంలో భాగంగా మాత్రమే మౌత్ వాష్ వినియోగించడం జరుగుతుంది. కొన్ని మౌత్ వాషులు, ప్రత్యేకించి ఫ్లోరైడ్ కంటెంట్ కలిగి ఉంటుంది. ఇవి వైద్యుల సలహా మేరకు వినియోగించడం జరుగుతుంటుంది. ఇవి, పళ్ళను బ్యాక్టీరియా ద్వారా ప్రభావితం చేసే ఆమ్లతత్వాల నుండి దంతాలను రక్షించగలవు. మీరు గమ్ సమస్యలను లేదా నోటి సంక్రమణ వ్యాధులతో బాధపడుతుంటే మీ దంతవైద్యుడు నిర్దిష్టమైన మౌత్ వాష్లను సూచించవచ్చు. కొన్ని మౌత్ వాష్లు మాత్రం ఫ్లోరైడ్ నుండి వ్యతిరేక ప్రయోజనాలను అందిస్తాయి, అయితే మిగిలినవి దంతాల ఫలకాన్ని దెబ్బతీసే క్రిములను నాశనం చేయడంలో సహాయపడుతాయి. అనేక మౌత్ వాష్లు ఆల్కహాల్ కంటెంట్ కలిగి ఉంటాయి, అనుకోకుండా కొందరు మింగిన సందర్భంలో సమస్యలను కలిగించవచ్చు. అయితే, ఆల్కహాల్ రహిత మౌత్ వాష్లు కూడా అందుబాటులో ఉన్నాయని గుర్తుంచుకోండి. సున్నితమైన చిగుళ్ళు ఉన్నవారికి సహజ సిద్దమైన మౌత్ వాషులు సరిపోతాయి. సహజసిద్దమైన మౌత్ వాష్లలో అలోవేరా మరియు చమోమిలే(చామంతి) వంటి పదార్థాలు ఉన్నాయి. మౌత్ వాష్ ను ఉపయోగిస్తే లాభమా? నష్టమా? తెలుసుకోండి మరి ఆరోగ్యకరమైన దంతాలు మరియు చిగుళ్ళ కోసం మౌత్ వాష్ ఎంతవరకు అవసరం? మీరు నోటి పరిశుభ్రతను పాటిస్తున్నవారైన ఎడల, రోజులో కనీసం రెండు సార్లు బ్రష్ చేసే అలవాటు కలిగి, అప్పుడప్పుడు పుక్కిలించడం వంటివి చేస్తూ ఎప్పటికప్పుడు దంతాలను శుభ్రంగా ఉంచేలా ప్రయత్నిస్తుంటారు. మీకు మౌత్ వాష్లతో అంతగా అవసరం కూడా ఉండదు. మౌత్ వాష్లు మీ దంతాల ఉపరితలం మీద మాత్రమే ప్రభావవంతంగా పని చేస్తాయి. ఇదివరకే బ్యాక్టీరియా కారణంగా ఫలకాల ఏర్పాటు ఉంటే, వాటి విషయంలో మౌత్ వాష్లు అంత సమర్ధవంతంగా పనిచేయవు కూడా. మౌత్ వాష్లు, చెడు శ్వాసను తొలగించుటలో సమర్థవంతంగా పనిచేస్తాయి. కానీ, క్రిములను పూర్తి స్థాయిలో నివారించడంలో సమర్థవంతమైనది కాదు. అయినప్పటికీ, మీరు మౌత్ వాష్లు ఉపయోగించడం కొనసాగించాలనుకుంటే, యాంటీ బాక్టీరియల్ తత్వాలు కలిగి ఉన్నదాన్ని ఎంచుకోవడం ఉత్తమం, తద్వారా ఇది క్రిములతో కూడిన దంత ఫలకాలతో కూడా యుద్ధం చేయగలదు. మౌత్ వాష్ యొక్క ఉపయోగాలు :మౌత్ వాష్ అనేది నోటి పరిశుభ్రతను కాపాడుకునే క్రమంలో అనేక మందికి ఒక అలవాటుగా ఉంటుంది. మౌత్ వాష్ ఉపయోగించడం వలన కలిగే లాభాలు క్రింద పొందుపరచడం జరిగింది. మౌత్ వాష్, కావిటీస్ సమస్యలతో పోరాడే పోరాట సామర్థ్యం కలిగి ఉంటాయి. దంతక్షయం దారితీసే బ్యాక్టీరియాను దూరంగా ఉంచడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. అలాగే, మీ మౌత్ వాష్లో ఫ్లోరైడ్ కలిగి ఉంటే, అది అదనపు ప్రయోజనంగా చెప్పబడుతుంది. పళ్ళ యొక్క ఎనామెల్ను బలపరచడంలో ఫ్లోరైడ్ ఆధారిత మౌత్ వాష్లు ఉత్తమంగా పని చేస్తాయి, అంతేకాకుండా కావిటీస్ నుండి రక్షణ కల్పించడంలో అద్భుతంగా సహాయపడగలవు. మౌత్ వాష్లు చిగుళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. వాపు లేదా గమ్ వ్యాధులను నిరోధించడంలో భాగంగా చిగుళ్ళ మీద చేరే బ్యాక్టీరియాను తొలగించడంలో సహాయం చేస్తుంది. మౌత్ వాష్లు, దంతాల మీద మరకలను తొలగించుటలో సహాయం చేయడం ద్వారా, దంతాలను తెల్లగా మెరిసేలా చేయడంలో దోహదంచేస్తాయి. మౌత్ వాష్లు నోటి దుర్వాసన తొలగించడంలో ఉత్తమంగా పని చేస్తుంది, క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని పెంచగలుగుతుంది. మౌత్ వాష్లు నోటి పూతల నుండి ఉపశమనం అందివ్వడంలో సహాయం చేస్తాయి. కాని ఆల్కాహాల్ లేని మౌత్ వాష్ ఉపయోగించడం వలన బాధాకరమైన పూతల చికిత్సలో వేగవంతమైన స్పందన ఉంటుంది. ఇది వాపు-కలిగించే బ్యాక్టీరియాను నిర్మూలించడం ద్వారా పనిచేస్తుంది. మౌత్ వాష్ చెడు ప్రభావాలు :మౌత్ వాష్ వినియోగం కొన్ని దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుందని చెప్పబడింది. వాటి గురించిన వివరాలు ఇక్కడ. నోటి వలయాలకు చికాకును కలిగించవచ్చు. అధిక ఆల్కహాల్ కంటెంట్ ఉన్న మౌత్ వాష్లలో బలమైన యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి అధిక ఘాడత తత్వాలను కలిగి ఉన్నందువలన నోటి లోపలి కణజాలాలకు అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అందువలన, ఆల్కహాల్ ఆధారిత మౌత్ వాషెస్ వినియోగించడం మూలంగా నోటి పూతలు కలిగిన వారు అసౌకర్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మరియు ఇవి చికిత్సను ఆలస్యం చేయవచ్చు. మీరు అనుకోకుండా మౌత్ వాష్ మింగేస్తే, అది ప్రమాదకరమైనదిగా కూడా పరిణమించవచ్చు, ముఖ్యంగా ఆల్కహాల్ ఆధారిత మౌత్ వాష్ల వినియోగం, చేసేవారు. అందుచేతనే 6 సంవత్సరాలలోపు పిల్లలకు మౌత్ వాష్లను ఏ వైద్యుడు కూడా సిఫార్సు చేయరు. మౌత్ వాష్ల వాడకం నోరు పొడిబారడానికి కూడా దారి తీస్తుంది. ఆల్కహాల్ ఆధారిత మౌత్ వాష్ యొక్క అధిక వినియోగం మీ నోటిని అత్యంత పొడిగా చేయగలదు. ఇది కావిటీస్ మరియు చెడు శ్వాసలను తగ్గించక పోగా, పంటి సున్నితత్వాన్ని కలిగిస్తుంది కూడా. మౌత్ వాష్ల అధిక వాడకం వలన తీవ్రమైన నోటి ఆరోగ్య సమస్యలు కలిగే అవకాశాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా మౌత్ వాష్లను ఉపయోగించినప్పుడు దీర్ఘకాలిక చెడు శ్వాస మరియు దీర్ఘకాలిక హాలిటోసిస్ పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. దీర్ఘకాలిక హాలిటోసిస్ సమస్య తలెత్తిన ఎడల ఏమాత్రం ఆలస్యం చేయకుండా, దంత వైద్యుని సంప్రదించడం మేలు. కావున అధిక వినియోగం ఎన్నటికీ మంచిది కాదని చెప్పబడింది. చివరిగా ...మీ నాలుక వెనుక భాగంలోని కొద్దిపాటి ప్రాంతంలో నివసిస్తున్న బ్యాక్టీరియా కారణంగా, చెడు శ్వాస సంభవిస్తుందని కొందరు వైద్యులు ప్రమాణపరుస్తున్నారు. సులభంగా వాటిని మీ టూత్ బ్రష్ ఉపయోగించి బ్రష్ చేయడం ద్వారా శుభ్రం చేయవచ్చు. దీనికి మౌత్ వాష్ ఉపయోగించనవసరం లేదు. మీ చెడు శ్వాసను తొలగించడానికి బ్యాక్టీరియాను దూరంగా ఉంచడంలో అన్నివేళలా మౌత్ వాష్ వినియోగించడం సూచించదగినదికాదు. ఒక మౌత్ వాష్ ఉపయోగించడం, బ్రషింగ్ మరియు ఫ్లాసింగ్ వంటి చర్యలకు ప్రత్యామ్నాయం ఎన్నటికీ కాదు. అంతేకాకుండా, కేవలం మంచి మౌత్ వాష్ వినియోగించడం కారణంగా నోటి ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు అనుకోవడం అపోహే.

# సతీ సావిత్రి కథ!


:సావిత్రి కన్నా సతీ సావిత్రి అంటేనే అందరికీ ఆమె గుర్తొస్తుంది. పురాణాల్లో ఈ పాత్రకు ఒక ప్రత్యేకత ఉంది. అశ్వపతి, మాళవిల గారాల పట్టీ సావిత్రి. అశ్వపతి మద్ర దేశానికి రాజు. ఈ దంపతులకు అన్నీ ఉన్నా సంతానం లేదనే ఒక బాధ ఉండేది. దీంతో వీరు పూజలు చేస్తారు. అయినా ఫలితం ఉండదు. ఒక రుషి సూచన మేరకు 18 సంవత్సరాలు ఉపాసనం చేస్తారు. అప్పుడు సావిత్రి వీరికి పుడుతుంది. ఆమెను ఎంతో అల్లారుముద్దుగా పెంచుతారు. సావిత్రికి పెళ్లి వయస్సు రాగానే ఆమెను కోరుకున్న వాడికి ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు అశ్వపతి. సావిత్రికి సత్యవంతునుడి గురించి తెలిసి ఉంటుంది. అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది సావిత్రి. సత్యవంతుడి పేరు చిత్రాశ్వుడు. అయితే ఆయన ఎప్పుడూ సత్యమే మాట్లాడడం వల్ల ఆ పేరు వచ్చింది. సరే తల్లి నీ కోరిక మేరకు నువ్వు కోరుకున్న అతనితోనే పెళ్లి చేయిస్తానని అంటాడు అశ్వపతి. అయితే సత్యవంతుడు పట్టుమని మరో ఏడాది కూడా బతకడని అశ్వపతికి తెలుస్తుంది. అతని ఆయువు తీరిపోయిందని త్వరలో మరణిస్తాడని అశ్వపతికి తెలియడంతో పెళ్లికి నిరాకరిస్తాడు. అయితే సావిత్రి మాత్రం తాను అతన్ని తప్ప మరొకరిని పెళ్లి చేసుకోనని చెబుతుంది. దీంతో చివరకు సత్యవంతుడితో సావిత్రి వివాహం జరిపిస్తాడు అశ్వపతి. సత్యవంతుడికి పెద్దగా ఆస్తిపాస్తులుడవు. అలా అని అత్తింటివారు ఇస్తే తీసుకునే రకం కాదు. మొత్తానికి సత్యవంతుడితో పాటు అరణ్యంలో బతికింది సావిత్రి. భర్తనే లోకంగా బతికింది. సావిత్రి మామ రాజ్యాన్ని కోల్పోతాడు. అంధుడవుతాడు. భర్త, అత్తమామలనే దైవంగా భావించి వారికి సేవలు చేస్తూ ఉంటుంది సావిత్రి. ఏమీ లేకున్నా తనను దేవతలా చూసుకున్న భర్తను చూసి మురిసిపోతుంది సావిత్రి. ఇంతలోనే సత్యవంతుడికి మరణం దగ్గర పడుతుంది. దీంతో సావిత్రి వారం రోజుల పాటు ఉపవాసం చేస్తుంది. చివరి రోజున సత్యవంతుడి అనారోగ్యంతో అల్లాడిపోతాడు. మరణం తన భర్త దరి చేరిందని తెలుసుకున్న సావిత్రి భర్తను తన ఒళ్లో పెట్టుకుని పడుకోబెట్టుకుంటుంది. అయితే యముడు ఎదురుగా వచ్చి నిలబడతాడు. ఎవరు నువ్వు అని సావిత్రి ఆయన్ని అడుగుతంది. యముడు ఆశ్చర్యపోతాడు. “నేను ఎవ్వరికీ కనపడను. అలాంటిది ఈమెకు ఎలా అగుపించాను” అని అనుకుంటాడు. సావిత్రి ఎంతో పతివ్రత కాబట్టి తాను కనపడ్డానని తెలుసుకుంటాడు. తర్వాత తాను ఎందుకు వచ్చానో యముడు చెప్పి సత్యవంతుడి ప్రాణాలను తీసుకుని వెళ్లిపోతుంటాడు. ఇదంతా గమనించిన సావిత్రి యముడి వెంట ఏడ్చుకుంటూ వెళ్తుంది. ఎందుకు నా వెనుక వస్తున్నావు అంటూ యముడు కోప్పడుతాడు. నా భర్త వెంట నడవడమే నా ధర్మం అంది. ఎంతకూ వెనుదిరిగిపోకపోవడంతో యముడు నీకు ఏదైనా వరం కావాలో కోరుకోమంటాడు. అయితే నీ భర్త ప్రాణం కాకుండా ఏదైనా సరే కోరుకో అంటాడు. గుడ్డివారైనా తన అత్తమామలకు కళ్లు రావాలి అని కోరుకుంటుంది. సరే అని ప్రసాదిస్తాడు. అయినా కూడా యుముడి వెంటే వెళ్తుంది సావిత్రి. మళ్లీ ఏమైంది సరే ఇంకో వరం కోరుకో అంటాడు యముడు. మా మామయ్య తన రాజ్యాన్ని మళ్లీ దక్కించుకునేలా చెయ్యండి అని కోరుతుంది. సరే అని ప్రసాదిస్తాడు.

అయినా సావిత్రి యముడి వెంటే వెళ్తూ ఉంటుంది. సరే మరో వరం కోరుకో ఇస్తానంటాడు. ఈసారి యముడు నీ భర్త ప్రాణం తప్ప అనే మాట మరిచిపోతాడు. దాంతో సావిత్రి వెంటనే నా భార్త ప్రాణం తిరిగి ఇవ్వండి అని మొక్కుతుంది. యముడు తాను ఇచ్చిన మాట ప్రకారం సావిత్రి భర్త ప్రాణాలు తిరిగి ఇచ్చేస్తాడు. సావిత్రి ఎంతో పతివ్రత కాబట్టే యముడు కూడా వరాలిచ్చాడు. ఆమెపాతివ్రత్యం చరిత్రలో అలా నిలిచిపోయింది.

# కార్తీక మాసంలో ఆ కూరగాయలు వాడకూడదు...

కార్తీక మాసం పరమేశ్వరునికి ప్రీతికరమైనది. ఆ కార్తీక మాసంలో శివుని ఆరాధించిన వారికి ఈతిబాధలు, గ్రహదోషాలు తొలగిపోతాయన్నది విశ్వాసం. ముఖ్యంగా చాలామంది ఈ మాసంలో తులసి మాలలు ధరించి ఉసిరి చెట్టును పూజిస్తుంటారు. ఇలా చేస్తే సకలసంపదలు చేకూరుతాయని విశ్వాసం. కార్తీకమాసంలో కార్తీక పురాణం 30 అధ్యాయాల్లో రోజుకు ఓ అధ్యాయం పారాయణం చేస్తే శుభదాయకమని చెప్తున్నారు. ఈశ్వరుని అశుతోషుడు అని కూడా పిలుస్తారు. భక్తులు కోరిన వరాలను తక్షణమే ప్రసాదించే భగవానుడు పరమేశ్వరుడే. కనుక శివ మంత్రాన్ని స్మరిస్తూ స్వామివారికి అలంకారాలు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేయాలని పురాణాలలో చెప్పబడి వుంది. కార్తీక నియమాన్ని పాటించేవారు వీటిని తీసుకోకూడదు. అవేంటంటే.. ఇంగువ, ఉల్లి, ముల్లంగి, ఆనపకాయ, మునక్కాయ, వంకాయ, గుమ్మడి కాయ, చిక్కుడు, వెలగపండ్లు వంటి వాటిని వంటల్లో చేర్చుకోరాదు. అలానే మిగిలిన అన్నం, మాడన్నం, మినుములు, పెసలు, శెనగలు, ఉలవలు కూడా వాడకూడదు. ముఖ్యంగా కార్తీక నెలలో వచ్చే ఆదివారం నాడు, సప్తమినాడు ఉసిరికాయ, అష్టమినాడు కొబ్బరిని వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

# కొనసాగుతున్న లేఆఫ్స్ పర్వం.. ఆగస్టులోనే 27 వేల మంది టెకీలపై వేటు



కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం సంకేతాల నేపథ్యంలో దాదాపు అన్ని సంస్థలు తమ ఉద్యోగుల్ని ఎడాపెడా పీకేసిన విషయం తెలిసిందే. చిన్నా, పెద్ద కంపెనీలన్న తేడా లేకుండా అన్ని సంస్థలూ ఉగ్యోలకు లేఆఫ్స్ ప్రకటించాయి. ఈ ఏడాది కూడా చాలా సంస్థలు లేఆఫ్స్‌ను కొనసాగించాయి. అమెజాన్, ట్విట్టర్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ ఇలా ఎన్నో దిగ్గజ కంపెనీలు ఉద్యోగుల్ని తొలగించాయి. భారత్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థలూ ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గించుకున్నాయి. ఇక ఈ ఏడాది ఆగస్టు నెలలోనే పలు సంస్థలు ఏకంగా 27 వేల మంది ఉద్యోగుల్ని తొలగించాయి. ఇంటెల్, ఐబీఎం, సిస్కో, డెల్ వంటి టాప్ సంస్థల్లో ఈ లేఆఫ్స్ కొనసాగాయి. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకూ దాదాపు 422 కంపెనీలు సుమారుగా 1,36,000 కంటే ఎక్కువ మందికే ఉద్వాసన పలికాయి. అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్ భారీఎత్తున ఉద్యోగులను తొలగించింది. ఇంటెల్ సీఈఓ పాట్ గెల్సింగర్ తన ఉద్యోగులకు పంపిన సమాచారంలో ఈ బాధాకరమైన వార్తను తెలిపారు. 2025 నాటికి రూ.83,761 కోట్లు (సుమారుగా) ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దీని కోసం ప్రస్తుతం పని చేస్తున్నవారిలో 15 శాతం (అంటే 15,000) మందిని తొలగించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ఆఫర్‌ను ప్రకటిస్తామన్నారు. 'రెండో త్రైమాసికం ఫలితాలు నిరాశపరిచాయి. చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఉత్పత్తులు, తయారీ ప్రక్రియలో ఎన్నో మైలురాళ్లను అధిగమించినప్పటికీ.. ఫలితాలు ఆశించిన స్థాయిలో మాత్రం లేవు. దీంతో కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఇంకా కఠిన సవాళ్లతో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది' అని తెలిపారు. ఇటీవలే ముగిసిన త్రైమాసికంలో కంపెనీ 1.6 బిలియన్ డాలర్ల వరకు నష్టం నమోదు చేసింది. ఇక ఇంటెల్ కంపెనీలో గత ఏడాది చివరి నాటికి 124,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 15 శాతం మందిని తొలగించాలని తాజాగా కంపెనీ నిర్ణయించింది. ఇప్పుడు ఉద్యోగుల్ని తొలగించడం వల్ల ప్రతి సంవత్సరం ఇంటెల్‌కు.. 20 బిలియన్ డాలర్ల వరకు ఖర్చులు తగ్గుతాయని అంచనా. డెల్ టెక్నాలజీస్ కూడా గత 15 నెలల్లో రెండవ దశ లేఆఫ్స్‌ను ప్రకటించింది. కంపెనీ ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మందిని అంటే.. ఏకంగా 12,500 మందిని విధుల నుంచి తొలగించింది. ఏఐతో పాటు ఆధునిక ఐటీ సొల్యూషన్స్‌పై దృష్టి సారించే క్రమంలో ఉద్యోగులపై వేటు వేశాయి.కంపెనీ కార్యకలాపాల క్రమబద్ధీకరణ, భవిష్యత్ వృద్ధికి దారితీసే రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఉద్దేశంతో ఉద్యోగుల సంఖ్యను డెల్ కుదించిందని చెబుతున్నారు. ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని డెల్ గ్లోబల్ సేల్స్, కస్టమర్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ బిల్ స్కానెల్, గ్లోబల్ చానెల్స్ చీఫ్ జాన్ బైర్న్ ఓ మెమో ద్వారా సమాచారం అందించారు. భవిష్యత్ వృద్ధి కోసం ఈ బాధాకరమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వారు వెల్లడించారు. అదేవిధంగా ప్రపంచంలోని ప్రముఖ నెట్వర్కింగ్ ఈక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఒకటైన సిస్కో ఈ ఏడాది రెండో విడత కోతల్లో భాగంగా భారీగా లేఆఫ్స్ ప్రకటించింది. 5,900 మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు సిస్కో సిస్టమ్స్ తెలిపింది. సంస్థలోని ఉద్యోగుల సంఖ్యలో 7 శాతం మందిపై వేటు వేసింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో 4 వేల మందికి సిస్కో ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. కంపెనీ ప్రధాన వ్యాపారంలో డిమాండ్ తగ్గడం, సరఫరా చైన్‌లో సమస్యల కారణంగానే కంపెనీ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. జర్మనీ చిప్ మేకర్ సంస్థ ఇన్ఫియన్ 1400 సిబ్బందిని, ఐబీఎమ్ వెయ్యి మందిని, కెనడియన్ ఆన్‌లైన్ ఫుడ్ సర్వీస్ స్కిప్ ది డిషెసెస్ 800 మందిని తొలగిస్తున్నట్టు ప్రకటించాయి. ఇక ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ సైతం 600 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. వీరిలో చాలామంది స్మార్ట్ కారు, స్మార్ట్‌వాచ్ డిస్‌ప్లే వంటి ప్రత్యేక ప్రాజెక్టుల్లో విధులు నిర్వహిస్తున్న వాళ్లే. భారీ ఖర్చు సహా వివిధ కారణాల వల్ల ఈ ప్రాజెక్టులను యాపిల్ పక్కన పెట్టింది. వీటితోపాటు ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ తన క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో వందలమంది ఉద్యోగులను తొలగించింది. ఆర్థిక సమస్యల కారణంగా బైజూస్ ఏప్రిల్‌లో 500 మంది ఉద్యోగులను తొలగించింది. ఇక ఎలాన్‌మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా ప్రపంచ వ్యాప్తంగా ఆ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగుల్లో 10 శాతం మందిని విధుల నుంచి తొలగించింది.

# విద్యుత్ సర్‌చార్జీలతో పరిశ్రమలు విలవిల..! ఆందోళనలో పారిశ్రామిక వర్గాలు..!



హైదరాబాద్, సెప్టెంబర్ 5 : రాష్ట్రంలో విద్యుత్తు దెబ్బకు పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయి. సర్‌చార్జ్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇష్టమున్నట్లు వడ్డిస్తుండటంతో పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందుతున్నారు. ఓపెన్ యాక్సిస్ విద్యుత్తుపై అదనపు సర్‌చార్జ్ పేరుతో ఒక్కో యూనిట్‌కు రూ.1.40 వసూలు చేస్తున్నారు. ఇక బకాయిలపై కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ పేరుతో 18 శాతం వడ్డీని ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో పరిశ్రమవర్గాలు లబోదిబోమంటున్నాయి. పరిశ్రమలు ప్రభుత్వ సంస్థల నుంచే కాకుండా ప్రైవేటు కంపెనీల నుంచి ఓపెన్ యాక్సెస్ పద్ధతిలో విద్యుత్తు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుతం ఓపెన్ యాక్సిస్ పద్ధతిపై నిషేధం ఉండగా, ఇప్పటికే ఈ విధానంలో విద్యుత్తును కొనుగోలు చేస్తున్న పరిశ్రమల నుంచి సర్‌చార్జ్‌తోపాటు స్టాండర్డ్ అడిషనల్ సర్‌చార్జ్ పేరుతో అదనంగా ఒక్కో యూనిట్‌పై రూ.1.40 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది పరిశ్రమలకు తలకుమించిన భారంగా మారింది. ఓపెన్ యాక్సెస్ విద్యుత్తు కొనుగోలుపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, అదనపు సర్‌చార్జిని ఎత్తివేయాలని పరిశ్రమవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వివిధ కారణాలతో మూతపడిన పరిశ్రమల విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఆ బకాయిలపై 18 శాతం వడ్డీ భారాన్ని మోపుతున్నారు. నష్టాలతో మూతపడిన చాలా పరిశ్రమలు ఇప్పుడు మళ్లీ ప్రారంభించుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ముందుగా తమ బకాయిలు తీర్చాలని విద్యుత్తు సంస్థలు పట్టుబడుతున్నాయి. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టి విద్యుత్తు బకాయిలను పరిష్కరించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. ఐఎస్‌టీఎస్(ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం) పథకం కింద కేంద్రం రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీకి భారీగా రాయితీలు అందిస్తున్నది. అయితే మన రాష్ట్రంలో రూఫ్‌టాప్ విద్యుత్తును ఒక మెగావాట్ సామర్థ్యం వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాగా, దీన్ని ఐదు మెగావాట్ల సామర్థ్యానికి పెంచుకునేందుకు వీలుగా తమకు నిరభ్యంతర ధృవపత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వాలని పరిశ్రమాధిపతులు కోరుతున్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏపెన్ యాక్సిస్ గ్రీన్ పాలసీకి సంబంధించి మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు. అలాగే, పరిశ్రమల్లో బాయిలర్ల ద్వారా విడుదలయ్యే వేడి వాయువుల (డబ్ల్యూహెచ్‌ఆర్‌బీ-వేస్ట్ హీట్ రికవరీ బాయిలర్స్)నుంచి విద్యుత్తు తయారుచేసుకునే అవకాశం కూడా కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వాయువులను చల్లార్చి గాలిలోకి వదలాల్సి వస్తున్నదని, దీనివల్ల అదనంగా నిర్వహణ భారం పడుతున్నదని చెబుతున్నారు. తమకు అనుమతిస్తే ఎవరి పరిశ్రమలో వారు కొంతమేరకు విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే వీలు కలుగుతుందని అంటున్నారు. విద్యుత్తుకు సంబంధించి వివిధ సమస్యలపై ఇటీవల తాము టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి వినతిపత్రం సమర్పించినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తమ వినతులు పరిష్కరించకుంటే మునుముందు పరిశ్రమలు కొనసాగించడం మరింత కష్టమవుతుందని వారు వివరించారు.

# పిల్లలకు తప్పక నేర్పాల్సిన ఆర్థిక పాఠాలు.. పొదుపు నుంచి చారిటీ వరకూ..




పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించగల అత్యుత్తమ జీవిత పాఠాలలో డబ్బు ప్రాధాన్యం ఒకటి. నిజమేనండి.. ఆర్థిక అక్షరాస్యత అనేది చిన్ననాటి నుంచే అలవరచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. చిన్నప్పుడు వారికి పడే ఆ పునాది పెద్దవారయ్యాక కూడా వారిని ధృఢంగా నిలబెడుతుంది. వారు తెలివైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం అధికంగా ఉంటుంది. వారి చూసే అన్నీ నేర్చుకుంటూ ఉంటారు. అందుకే అంటారు చిన్న పిల్లలు నడవాల్సిన మార్గాన్ని తల్లిదండ్రులే వారికి బోధించాలి.. పెద్దయ్యాక వారు ఎటువంటి పరిస్థితులు ఎదురైన ఆ మార్గం నుంచి బయటకు రారు. అన్ని విషయాలు చెబుతూ ఉంటారు గానీ.. డబ్బు విషయంలో పిల్లలను దూరం పెట్టడం ప్రతి ఇంట్లో జరుగుతుంది. అయితే పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించగల అత్యుత్తమ జీవిత పాఠాలలో డబ్బు ప్రాధాన్యం ఒకటి. నిజమేనండి.. ఆర్థిక అక్షరాస్యత అనేది చిన్ననాటి నుంచే అలవరచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. చిన్నప్పుడు వారికి పడే ఆ పునాది పెద్దవారయ్యాక కూడా వారిని ధృఢంగా నిలబెడుతుంది. వారు తెలివైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. అందుకు ఉపయోగపడే టిప్స్ మీకు అందిస్తున్నాం.

మనీ బేసిక్స్..

పిల్లలకు డబ్బు నిర్వహణపై సరైన పునాది వేయాలి. దాని ప్రాధాన్యం, ఖర్చు పెట్టాల్సిన విధానంపై అవగాహన చిన్ననాటి నుంచే అవసరం. పొదుపు, ఖర్చు, డబ్బుకున్న విలువను అర్థం చేసుకునేలా చేయాలి. డబ్బు ఎలా వస్తుందో చెప్పాలి. వారికి ఏదైనా వస్తువు కావాలంటే దానిని బడ్జెట్ ఎలా ఉంచాలో వివరించండి. పిల్లలకి పిగ్గీ బ్యాంక్ ఇవ్వండి. ప్రత్యేకమైన వాటి కోసం ఎలా పొదుపు చేయాలో నేర్పించండి. ఈ పొదుపుతో కాలక్రమేణా డబ్బు పెరుగుతుందని అర్థం చేసుకునేలా చేయాలి.

డబ్బు ఇవ్వండి..

పిల్లలకు కొంత మొత్తంలో అలోవెన్స్ కింద డబ్బు ఇస్తే వాటి నిర్వహణను బోధించడానికి ఉపకరిస్తుంది. మీరు చెప్పిన పనులు వారు సంపూర్తి చేసిన తర్వాత లేదా వారానికోసారి వారికి కొంత మొత్తం ఇవ్వవచ్చు. దీని ద్వారా ఖర్చు చేయడం, పొదుపు చేయడం, ఇతర అవసరాలకు ప్రత్యేకంగా కేటాయించేలా వారిని ప్రోత్సహించండి. మీ పిల్లలు ఖరీదైన వస్తువును కొనుగోలు చేయాలనుకున్నప్పుడు, కాలక్రమేణా డబ్బును ఆదా చేసేలా వారిని ప్రోత్సహించడం ద్వారా అది వారికి ఆలస్యమైన సంతృప్తినిచ్చేలా చేస్తుంది.

సంపాదన విలువ..

పని చేయడం వల్ల డబ్బు సంపాదించవచ్చని మీ పిల్లలకు నేర్పండి. దీన్ని మరింత అర్థం చేసుకోవడంలో వారికి సహాయపడటానికి, అదనపు పనులు లేదా పనుల కోసం అదనపు డబ్బు సంపాదించే అవకాశాన్ని మీ పిల్లలకు అందించండి. ఇది వారికి కష్టపడి పని చేయడం, వ్యక్తిగత బాధ్యత గురించి అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది.

నీడ్స్ వర్సెస్ వాంట్స్..

పిల్లలు అర్థం చేసుకోవడానికి ఇది కొంచెం కష్టం కావొచ్చు. అన్ని అవసరాలు కోరికలు కాకపోవచ్చు. అలాగే అన్ని కోరికలు అవసరాలు కాకపోవచ్చు. కానీ డబ్బు ఖర్చు చేసేటప్పుడు ఈరెండింటి మధ్య బ్యాలెన్స్ ఎలా ఉండాలో మీ పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాలి. ముఖ్యంగా మీ పిల్లలతో వారికి కావాల్సిన అన్నింటితో ఒక జాబితాను సృష్టించండి. దానిలో ఏది అవసరం, ఏది కోరిక అనేది వర్గీకరించమని చెప్పాలి. ఇది వారికి ఖర్చులకు ఎలా ప్రాధాన్యత ఇవ్వాలో అర్థం అవుతుంది.

దానం చేయండి నేర్పండి..

మీ పిల్లలకు మీరిస్తున్న కొంత డబ్బు నుంచి కొంత భాగాన్ని చారిటీ కోసం కేటాయించేలా ప్రోత్సహించండి. మీరు స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే మొత్తాన్ని మీ పిల్లలను చూడనివ్వండి. మీ డబ్బు ఎక్కడికి వెళుతుందనే నిర్ణయాలలో వారిని భాగస్వామ్యం చేయండి.

రోల్ మోడల్‌గా ఉండండి

పిల్లలు తల్లిదండ్రుల అలవాట్లను అనుకరిస్తారు కాబట్టి, ఆర్థిక విషయాలకు సంబంధించినంత వరకు మంచి ఉదాహరణలను సెట్ చేయడం చాలా ముఖ్యం. మీరు బడ్జెట్‌ను ఎలా సృష్టించాలో, బిల్లులు చెల్లించడం, ఏదైనా వస్తువు కొనుగోలు చేయడానికి నగదును ఎలా ఆదా చేయాలి వంటి వాటిని మీరు వారికి వివరించవచ్చు. డబ్బుకు సంబంధించి మీరు ఎలా నిర్ణయాలు తీసుకుంటారో మీ పిల్లలకు తెలియనీయండి.

# ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఢబుల్ ధమాకా.. కొత్తగా లక్ష ఉద్యోగాలు!




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ పండగ సీజన్‌లో నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. త్వరలో భరీ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. పండగల సీజన్ వేళ నిర్వహించే బిగ్ బిలియన్ డేస్ సేల్ 2024 ఈ ఏడాది లక్ష ఉద్యోగాల సృష్టించబోతున్నట్లు సెప్టెంబరు 4న ఓ ప్రకటనలో తెలిపింది. ఓవైపు భారత్‌లోని పలు దిగ్గజ కంపెనీలు వరుస లేఆఫ్‌లు టెకీలను రోడ్డున పడేస్తుంటే.. ఫ్లిప్‌కార్డు ఉద్యోగాలు కల్పించేపనిలో పడింది. ఇప్పటికే గూగుల్‌తో సహా టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలు వేలల్లో ఉద్యోగాలు తొలగించింది. ఈ నేపథ్యంలో పండగ సీజన్ ముందు ఫ్లిప్‌కార్డు 11 కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. దీంతో వీటి సంఖ్య 83కు చేరుకుంటుంది. దేశ సామాజిక ఆర్థిక వృద్ధికి చేయూతలో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫ్లిప్‌కార్ట్ తన ప్రకటనలో తెలిపింది. ఇందులో భాగంగా సప్లయ్ చైన్ విభాగంలో ఒక లక్ష వరకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్రెషర్లకు కూడా ఇందులో ఉద్యోగాలు కల్పిస్తారట. ఈ పండగల సీజన్‌లో ఫ్లిప్‌కార్ట్ నిర్వహణ కార్యకలాపాలు మెరుగుపడడంతో పాటు స్థానిక కమ్యూనిటీకి ఉపాధి లభిస్తాయని తెలిపింది. సప్లయ్ చైన్ విభాగంలో ఇన్వెంటరీ మేనేజర్లు, వేర్ హౌస్ అసోసియేటర్లు, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్లు, కిరాణా పార్టనర్లు, డెలివరీ డ్రైవర్స్ వంటి విభాగాల్లో ఈ ఉద్యోగాలు కల్పించనున్నారు. మహిళలు, దివ్యాంగులు, ఎల్‌జీబీటీక్యూఏఐం కమ్యూనిటీకి చెందిన వారిని కూడా నియమించుకోబోతున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. కొత్తగా ఉద్యోగాల్లో తీసుకునే వీరికి తగిన శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వీపీ, సప్లై చైన్ హెడ్ హేమంత్ బద్రీ మాట్లాడుతూ.. కంపెనీ సప్లయ్ చైన్ నెట్‌వర్క్‌ను విస్తరించిందని, కస్టమర్ల డిమాండ్లను తీర్చేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఫ్లిప్‌కార్డు వినియోగదారులకు అసమానమైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని హేమంత్ బద్రీ తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, స్వయంచాలక గిడ్డంగులను అమలు చేయడం, డేటా-ఆధారిత నిర్ణయాత్మక వ్యవస్థలను చేర్చడం ద్వారా కంపెనీ తన సరఫరా గొలుసు కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి సాంకేతికతలో పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ తనసప్లయ్ చైన్‌ను పటిష్టం చేయడానికి, వర్క్‌ఫోర్స్‌ను పెంచడానికి తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం.. ఈ పండుగ సీజన్‌లో కస్టమర్ల డిమాండ్‌ను తీర్చడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అమెజాన్, బ్లింకిట్, జెప్టో, ఇన్‌స్టామార్ట్ వంటి ప్రత్యర్థులు కూడా పండుగ సీజన్‌లో పెద్ద మార్కెట్ పొందేందుకు పోటీ పడుతున్నారు.

# పన్ను కట్టేవారిలో వీరే తోపులు.. ఫస్ట్ ప్లేస్‌లో ఎవరున్నారో తెలిస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే





ప్రభుత్వాలకు పెద్ద ఆదాయం అంటే ట్యాక్స్. ప్రతి ఏడాది ఆదాయపు పన్ను ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుంటుంది. మన దేశంలో కోట్లాది రూపాయలుగా పన్ను చెల్లించే వ్యక్తులు ఎందరో ఉన్నారు. అలాంటి వారు కోట్లల్లో ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారి సంపాదన ఏ మేర ఉంటుందో ఊహకు అంతనంతగా ఉంటుంది. బాలీవుడ్ కింగ్ షారుఖ్ ఖాన్ బాలీవుడ్, స్పోర్ట్స్ రంగం నుంచి సెలబ్రిటీల వరకు పన్ను చెల్లింపుదారులలో మొదటి స్థానంలో ఉన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో షారుక్ ఖాన్ రూ.92 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.80 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించిన తమిళ నటుడు విజయ్ రెండో స్థానంలో నిలిచారు. ఆదాయపు పన్ను చెల్లింపులో క్రీడాకారుల్లో క్రికెటర్ విరాట్ కోహ్లీ మొదటి స్థానంలో ఉండగా, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ రెండో స్థానంలో నిలిచాడు. మరి ఎవరె ఎంత పన్ను చెల్లించారో పూర్తి వివరాలు తెలుసుకుందాం.

బాలీవుడ్ సెలబ్రిటీ పన్ను చెల్లింపుదారులు:

ఫార్చ్యూన్ ఇండియా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రముఖ పన్ను చెల్లింపుదారుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం.. షారుక్ ఖాన్ రూ.92 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. రూ.80 కోట్ల పన్ను చెల్లింపుతో నటుడు విజయ్ రెండో స్థానంలో రూ.75 కోట్ల ఆదాయపు పన్ను చెల్లింపుతో సల్మాన్ ఖాన్ మూడో స్థానంలో నిలిచారు. బిగ్ బి అంటే అమితాబ్ బచ్చన్ 2023-24 ఆదాయపు పన్ను రూపంలో రూ.71 కోట్లు చెల్లించారు. అజయ్ దేవగన్ రూ.42 కోట్లు, రణబీర్ కపూర్ రూ.36 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. హృతిక్ రోషన్ 28 కోట్లు, కపిల్ శర్మ 26 కోట్లు, కరీనా కపూర్ 20 కోట్లు, షాహిద్ కపూర్ 14 కోట్లు, కియారా అద్వానీ 12 కోట్లు, కత్రినా కైఫ్ 11 కోట్లు చెల్లించారు. ఈ జాబితాలో పంకజ్ త్రిపాఠి కూడా చేరారు. 11 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాడు. అమీర్ ఖాన్ రూ.11 కోట్లు, మలయాళ సినీ నటుడు మోహన్ లాల్ రూ.14 కోట్లు, అల్లు అర్జున్ రూ.14 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు.

సెలబ్రిటీ పన్ను చెల్లింపుదారులలో క్రికెటర్లు

క్రికెటర్లలో పెద్ద సంఖ్యలో సెలబ్రిటీ పన్ను చెల్లింపుదారులు కూడా ఉన్నారు. 66 కోట్ల పన్ను చెల్లింపుతో విరాట్ కోహ్లీ మొదటి స్థానంలో ఉన్నాడు. మహి అంటే మహేంద్ర సింగ్ ధోనీ 38 కోట్ల రూపాయల ఆదాయపు పన్ను చెల్లించారు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా రూ.13 కోట్లు, రిషబ్ పంత్ రూ.10 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించారు.




# ‘35 చిన్న కథ కాదు’ రివ్యూ



నివేథా థామస్ కథల ఎంపికలో పట్టున్న కథానాయిక. ఆమె ఓ సినిమా అంగీకరించిందీ అంటూ ఆ సినిమాలో ఏదో విషయం ఉంటుందనే ప్రేక్షకుల నమ్మకం. వకీల్‌సాబ్‌తో హిట్ అందుకున్న ఆమె ‘శాకిని-డాకిని’ చిత్రంతో పరాజయం చవిచూసింది. దాంతో ఏడాదిన్నపాటు తెలుగుతెరపై కనిపించలేదు. కొంత విరామం తర్వాత ఆమె నటించిన చిత్రం 35 చిన్న కథ కాదు. నూతన దర్శకుడు నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో వహించిన ఈ చిత్రానికి సురేష్ ప్రొడక్షన్స్. రానా దగ్గుబాటి సమర్పకులుగా వ్యవహరించారు. నివేథా హీరోయిన్ కావడం చడీచప్పుడు కాకుండా తెరకెక్కించిన ఈ చిత్రానికి రానా సమర్పకుడిగా వ్యవహరించడం పోస్టర్లు, ట్రైలర్లు ఆకట్టుకోవడంతో జనాల దృష్టి ఈ సినిమాపై పడింది. సరస్వతి (నివేతా థామస్) ప్రసాద్ (విశ్వదేవ్ రాచకొండ) తిరుపతిలో సాధారణ జీవితం సాగించే భార్యభర్తలు. ప్రసాద్ బస్సు కండెక్టర్. సరస్వతి టెన్త్ ఫెయిల్ అయిన గృహిణి. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్దోడు అరుణ్ (అరుణ్ దేవ్), చిన్నోడు వరుణ్ (అభయ్ శంకర్). చిన్నోడు చదువులో పర్వాలేదు కానీ పెద్దోడు లెక్కల్లో వీక్. అందుకే లెక్కల మాస్టారు చాణక్య వర్మ( ప్రియదర్శి) అరుణ్‌ని ‘జీరో’ అని పిలుస్తాడు. అయితే లెక్కలకు సంబంధించి అరుణ్ ఎప్పుడూ లాజిక్కులు అడుగుతుంటాడు. ఆ లాజిక్కులకు మాస్టార్ల దగ్గర సమాధానం ఉండదు. లెక్కల్లో వరుసగా జీరోలు తెచ్చుకోవడం వల్ల ఒక సంవత్సరం డిమోట్ అయ్యి తమ్ముడు చదువుతున్న క్లాసులో కూర్చోవాల్సి వస్తుంది. స్నేహితులకు దూరమై, చదువు భారంగా మారిన అరుణ్ స్కూల్లో కొనసాగాలంటే లెక్కల్లో కనీసం ’35’ మార్కులు తెచ్చుకోవాల్సిందే. అప్పుడు అరుణ్ ఏం చేశాడు? స్నేహితులకు దగ్గర కావడానికి, ఏం చేశాడు. లెక్కలంటే భయపడుతున్న కొడుకుకి పదో తరగతి ఫెయిల్ అయిన తల్లి పాఠాలు ఎలా చెప్పింది. చివరికి అరుణ్ లెక్కల్లో పాస్ అయ్యాడా లేదా అన్నది మిగిలిన కథ. తిరుపతిలో నివశించే చిన్న కుటుంబం, ఇద్దరు పిల్లలు వారి భవిష్యత్తు కోసం తపన పడే తల్లిదండ్రులు చుట్టూ తిరిగే కథ ఇది. ప్రథమార్థం సరస్వతి కుటుంబం, పిల్లలు, స్కూలు, లెక్కల్లో జీరో అయిన అరుణ్ గురించి చూపించారు. బ్రాహ్మణ కుటుంబం, ఇంట్లో వారి పద్ధతులు, మాట తీరూ అన్ని కూడా సన్నివేశాల రూపంలో చూపించారు దర్శకుడు. ఆ తర్వాత స్కూల్, అక్కడి పిల్లల యాంగిల్‌లోకి కథ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. మ్యాథ్‌మేటిక్స్ సబ్జెక్ట్ అనేది ఎప్పటికీ అంతు చిక్కని కథే. లాజిక్ తెలిసి, దాన్ని ఎలా సాల్వ్ చేయాలో తెలిస్తే ఆ సబ్జెక్ట్ అంతా ఈజీ, స్కోరింగ్ మరొకటి ఉండదు. ఇందులో అరుణ్ సమస్యే లెక్కల సబ్జెక్ట్. లెక్కలు పడనోడికి దానిని బోధించే మాస్టర్ కూడా విలన్‌లాగే కనిపిస్తాడు. ఇది నిజం జీవితంలో కూడా చూస్తుంటాం. ఈ చిత్రంలో చాణక్య (ప్రియదర్శి) పాత్రను అదే కోణంలో డిజైన్ చేశారు. ‘నేను పిల్లలతో బాగుండకపోయినా ఫర్వాలేదు. పిల్లలు, వారి భవిష్యతుల్ల బాగుండాలనే తీరు ఆ పాత్రది. సిక్స్ చదువుతున్న కొడుకు చెస్ ఆడుతూ తల్లిని ‘అమ్మా గుర్రం ఇలానే ఎందుకు దూకుతుంది?’ అని అమాయకంగా అడిగితే, దానికి తల్లి చెప్పిన లాజిక్ ఎంత అర్థవంతంగా ఉంటుందో? అదే అబ్బాయి క్లాసులో ‘విలువ లేని సున్నా ఒకటి పక్కన నిలబడితే, అది తొమ్మిది కంటే ఎందుకు ఎక్కువ అవుతుంది?’ అని నిలదీస్తే టీచర్ సమాధానం చెప్పలేదు. ‘నా దగ్గర రెండు పెన్నులు ఉన్నాయి. దాన్ని జీరోతో గుణిస్తే జీరో ఎలా అవుతుంది. నా దగ్గర ఇంకా రెండు పెన్నులు ఉన్నాయి కదా. అవి లేకుండా ఎక్కడికి పోతాయ్’ అని అడిగితే.. ఆన్సర్ చెప్పలేని మాస్టర్ బ్యాక్ బెంచ్‌లో కూర్చోబెడతాడు. మరో చిన్నారి కిరణ్‌మై రావడం, తన సపోర్ట్‌తో స్నేహితులంతా తోడై అరుణ్‌ని లెక్కల పరీక్షలకు సిద్ధం చేయడం ఆకట్టుకున్నాయి. కాపీ కొట్టి అయినా 35 మార్కులు తెచ్చుకోవచ్చు అని అరుణ్‌ని పుష్ చేస్తారు. అతను మాత్రం నిజాయతీగా తనని తాను నిరూపించుకోవాలనుకుంటాడు. అక్కడే కథ టర్న్ అయింది. అప్పటి దాకా పిల్లలు, స్కూల్ నేపథ్యంలో సాగిన కథ.. తల్లి కథగా మారింది. సరస్వతి పాత్రని మరింత స్ట్రాంగ్ చేయడం కోసం పదో తరగతి ఫెయిల్ అయిన ఆమె చేత మళ్లీ పుస్తకాలు పట్టించాడు దర్శకుడు. తన బిడ్డను లెక్కల్లో రాణించేలా తీర్చిదిద్దడానికి తను కష్టపడి పిల్లాడికి మంచి బాట వేసే ప్రయత్నం చేసింది. చాణిక్య, సరస్వతి పాత్రల మధ్య సన్నివేశాలు, సంభాషణలు అలరించాయి. వాళ్ల మాటలు కూడా లెక్కలు, ఫార్ములాల మాదిరి సాగడం ఆసక్తికరంగా ఉంటుంది. ‘సున్నా’కి విలువ ఎందుకు లేదు? అనే క్వశ్చన్‌తో మొదలైంది కథ. దానికి సరైన సమాధానం చెప్పాలి కదా! అరుణ్ జీవితం, అతనికి ఎదురైన సమస్యలకు వాటికి సమాధానం రాబట్టిన దర్శకుడికి ఇంటెలిజెన్స్‌ను చెబుతుంది. దర్శకుడు ఎంచుకున్న కథ నుంచి తెరకెక్కించిన విధానం బావుంది. లెక్కల్లో ప్లస్, మైనస్‌లు ఉన్నట్లు ఈ చిత్రంలో కూడా ప్లస్, మైనస్‌లు ఉన్నాయి. కథ ప్రారంభం నుంచి నెమ్మదిగా నడవడం, అసలు దర్శకుడు ఏం చెప్పాలనుకున్నాడో రివీల్ కావడానికి 45 నిమిషాల వ్యవధి తీసుకోవడం సినిమాకు మైనస్‌గా అనిపిస్తుంది. 35 మార్కుల కోసం ఇదంతా అని ఊహకు అందినప్పటికీ తెరపై అది రివీల్ కావడం బాగా సమయం తీసుకోవడం కాస్త సాగదీతలా అనిపించింది. అయితే అది కూడా ప్రతి సన్నివేశాన్ని కవితాత్మకంగా చెప్పే ప్రయత్నంలో భాగంగా అలా జరిగి ఉండొచ్చు. క్లైమాక్స్‌లో మార్కుల గురించి తండ్రి చెబుతున్న సందర్భంలో అరుణ్ అద్దంపై నీళ్లు కొట్టిన సన్నివేశం భావోద్వేగాన్ని పంచుతుంది. కమర్షియల్ సినిమాలకు అలవాటు పడిన ప్రేక్షుకలు ఈ తరహా కథను అంత తొందరగా యాక్సెప్ట్ చేయలేరు. కమర్షియల్ హంగులు లేకపోవడం ఈ సినిమాకు ఓ మైనస్ అనుకోవచ్చు. తిరుపతి యాస విషయంలో ఇంకా జాగ్రత్త తీసుకుంటే బావుండేది. ఇక ఆర్టిస్టల విషయానికొస్తే.. నివేథా థామస్ ఏ పాత్ర చేసినా పేరు పెట్టక్కర్లేదు. పాత్రకు తగ్గట్టు ఆమె ఒదిగిపోతుంది. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన సరస్వతిగా ఆ పాత్రకు వంద మార్కులు తెచ్చుకుంది.

# మహేష్ బాబు, విజయ్.. ఇద్దరూ క్రమశిక్షణ గల హీరోస్



దళపతి విజయ్, క్రియేటివ్ డైరెక్టర్ వెంకట్ ప్రభుల కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న పాన్ ఇండియా మూవీ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర విశేషాలను హీరోయిన్ మీనాక్షి చౌదరి మీడియాకు తెలియజేసింది. దళపతి విజయ్, క్రియేటివ్ డైరెక్టర్ వెంకట్ ప్రభుల కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న పాన్ ఇండియా మూవీ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రై లిమిటెడ్‌పై కల్పాతి ఎస్ అఘోరమ్, కల్పాతి ఎస్ గణేష్, కల్పాతి ఎస్ సురేష్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు వెర్షన్‌ను గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైన ఈ చిత్ర విశేషాలను హీరోయిన్ మీనాక్షి చౌదరి మీడియాకు తెలియజేసింది.

దళపతి విజయ్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

విజయ్‌గారితో వర్క్ చేయడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. విజయ్‌గారు పాలిటిక్స్‌కి ఎంటర్ అయ్యే ముందు చేసిన లాస్ట్ సినిమా ఇది. ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. సినిమా రిలీజ్ కోసం చాలా ఎక్సయిటింగ్‌గా ఎదురుచూస్తున్నాను.

ఈ ప్రాజెక్ట్‌లోకి మీరెలా వచ్చారు?

డైరెక్టర్ వెంకట్ ప్రభుగారు ఈ క్యారెక్టర్ కోసం అప్రోచ్ అయ్యారు. నా లుక్ టెస్ట్ చేసిన తర్వాత క్యారెక్టర్‌కి పర్ఫెక్ట్ అని సెలెక్ట్ చేశారు.

ఇందులో మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది?

నాది యంగ్ మోడరన్, కాలేజ్ గోయింగ్ గర్ల్ క్యారెక్టర్. వెరీ ఫన్ అండ్ లవింగ్‌గా వుంటుంది. నా పర్సనల్ లైఫ్‌కి కూడా రిలేటబుల్ క్యారెక్టర్ ఇది. ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్‌కి ఒక లేయర్ వుంటుంది. కథలో నా క్యారెక్టర్‌కి చాలా ఇంపార్టెన్స్ వుంటుంది. సినిమా చాలా ఎక్సయిటింగ్‌గా వుంటుంది. మహేష్ బాబుతో వర్క్ చేశారు. ఇప్పుడు విజయ్‌తో.. వారి మధ్య ఎలాంటి పోలికలు కనిఎంచాయి?

ఈ ఇద్దరితో వర్క్ చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఇద్దరూ చాలా క్రమశిక్షణ గల హీరోస్. సెట్స్‌లో అందరినీ సమానంగా గౌరవిస్తారు. వారితో వర్క్ చేయడం లైఫ్ టైం ఆపర్చ్యునిటీ.

ఈ సినిమాలో స్నేహ, లైలా వంటి సీనియర్స్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

స్నేహ, లైలా వంటి సీనియర్స్‌తో వర్క్ చేయడం గ్రేట్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్. కెరీర్ బిగినింగ్‌లోనే ఇలాంటి అవకాశం రావడం ఆనందంగా వుంది. అందరూ నన్ను చాలా కేర్‌గా చూసుకున్నారు.

డైరెక్టర్ వెంకట్ ప్రభు గురించి?

వెంకట్ ప్రభుగారు కూల్ పర్సన్. చిల్‌గా వుంటారు. ఆయన ఫిల్మ్ మేకింగ్ యూనిక్‌గా వుంటుంది. చాలా సపోర్టివ్‌గా వుంటారు. ఆయనతో వర్క్ చేయడం వెరీ న్యూ ఎక్స్‌పీరియన్స్.

బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం వెనుక స్పెషల్ ప్లాన్ ఉందా?

స్పెషల్ ప్లాన్ అంటూ ఏమీ లేదు. ఇందులో 2023లో సైన్ చేసిన సినిమాలు కూడా వున్నాయి. ‘లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ’ బ్యాక్ టు బ్యాక్ రిలీజ్‌కి రావడం కోఇన్సిడెంట్. ఇలాంటి మంచి సినిమాలలో పార్ట్ కావడం చాలా ఆనందంగా వుంది.

మీ సినిమాల ఎంపిక ఎలా వుంటుంది?

స్క్రిప్ట్ మోస్ట్ ఇంపార్టెంట్. కథ నచ్చితే తర్వాత నా క్యారెక్టర్ గురించి చూస్తాను. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలని ఇష్టపడతాను. ‘మట్కా’ పిరియడ్ ఫిలిం, అందులో నాది వెరీ డిఫరెంట్ అవతార్. ‘మెకానిక్ రాకీ’లో మిడిల్ క్లాస్ అమ్మాయిగా కనిపిస్తా. ‘లక్కీ భాస్కర్’లో మదర్ రోల్ ప్లే చేశా. అనిల్ రావిపూడి సినిమాలో కాప్ రోల్ చేస్తున్నాను. ఇవన్నీ దేనికవే స్పెషల్‌గా వుంటాయి.

ఫైనల్‌గా ‘ది గోట్’ గురించి ఏం చెబుతారు?

‘ది గోట్’ సినిమా అందరికీ న్యూ అండ్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది. ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి ఈ సినిమాను సక్సెస్ చేయాలని కోరుతున్నాను.

# దేవియాని.. బికినీ కంటే చీరలోనే మరింత అందంగా..



సోషల్ మీడియా ద్వారా ఫేమస్ అయ్యే హీరోయిన్స్ సంఖ్య రోజురోజుకు మరింత పెరుగుతోంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బ్యూటీస్ తమ టాలెంట్ చూపుతూ ప్రేక్షకులకు దగ్గరవుతున్నారు. సినిమా అవకాశాల కోసం కూడా ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ సంఖ్య కీలకంగా మారాయి. పలు నార్త్ హీరోయిన్స్ ఈ విధంగా పెద్దపెద్ద అవకాశాలు దక్కించుకుంటున్నారు. తెలుగులోనూ ఈ ట్రెండ్ బాగా కనిపిస్తోంది. తెలుగు వెబ్ సిరీస్‌ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవయాని శర్మ, ఈ నేపథ్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అనగనగా సిరీస్‌తో తెలుగు పరిశ్రమలోకి అడుగుపెట్టిన దేవయాని, భానుమతి - రామకృష్ణ చిత్రంలోనూ తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అయితే, ఆమెకు నిజమైన గుర్తింపు తెచ్చిన ప్రాజెక్ట్ మాత్రం సైతాన్ అనే క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్. ఇందులో దేవయాని తన పాత్రతో ప్రేక్షకుల అభిమానం పొందింది. ఆ తర్వాత సేవ్ ది టైగర్స్ అనే పాపులర్ సిరీస్ లో చైతన్య కృష్ణ భార్యగా నటించి, ఆమె నటనకు మంచి ప్రశంసలు అందుకున్నది. రెండో సీజన్ కూడా మంచి హిట్ అయింది. ఈ రెండు ప్రాజెక్ట్స్ తర్వాత ఆమె మరో ప్రాముఖ్యత కలిగిన పాత్రను ఝాన్సీ సిరీస్‌లో కూడా పోషించింది. వెబ్ సిరీస్‌లలో బిజీగా ఉన్నప్పటికీ, దేవయాని సినిమాల్లో కూడా అవకాశాలను వెతుకుతోంది. ఇక సోషల్ మీడియాలోనూ దేవయాని చాలా యాక్టివ్ గా ఉంటుంది. తరచుగా తన ఫోటోలతో అభిమానులను అలరిస్తుంటుంది. గతంలో బికినీలో కూడా స్టన్ అయ్యేలా కనిపించింది. ఇక ఆమె తాజా ఫోటోలు చాలా మంది నెటిజన్లను ఆకర్షించాయి. ఇందులో దేవయాని చీరకట్టులో సంప్రదాయ భారతీయ అందాన్ని చూపిస్తూ, తన ఫాలోవర్స్‌కు ప్రత్యేక సందేశం ఇచ్చింది. నీలం రంగు చీరలో ఆమె తీసుకున్న ఫోటోలు, జుట్టు సింపుల్‌గా వదిలేయడం, నడుముకు చీర కొంగుని వేసిన విధానం చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. దేవయాని తన గ్లామర్ తో కాకుండా, సింప్లిసిటీతోనూ ఆకట్టుకోవడం ఆమె ప్రత్యేకత. ఇలాంటి సంప్రదాయ లుక్స్‌లోనూ స్టైలిష్‌గా కనిపించడం చాలా అరుదు. నేటి తరం హీరోయిన్స్‌లో ఇలాంటి విభిన్నమైన స్టైల్‌ను ప్రదర్శించడం ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రేక్షకులను బాగా ఆకర్షిస్తోంది.

# చీరలో శోభిత మెరుపులు



త్వరలో అక్కినేని ఇంటికి కోడలిగా రాబోతున్న తెలుగు హీరోయిన్ శోభిత దూళిపాళ్ల. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ ఫోటోలని షేర్ చేస్తూ ఉంటుంది. అలాగే తన సినిమాలు, ప్రయాణాలకు సంబందించిన అప్డేట్స్ ని కూడా ఈ బ్యూటీ పంచుకుంటూ ఉంటుంది. శోభితకి ఇన్ స్టాగ్రామ్ లో ఫాలోవర్స్ భారీగానే ఉన్నారు. తెలుగు అభిమానులు నాకంటే నార్త్ ఇండియాలో శోభితని ఫాలో అయ్యేవారు ఎక్కువగా ఉంటారు. దీనికి కారణం శోభిత దూళిపాళ్ల హిందీ సినిమాలతోనే ఎక్కువ పాపులర్ అవ్వడమే. మోడలింగ్ లో కెరియర్ స్టార్ట్ చేసిన శోభిత 2013 మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని రన్నరప్ గా నిలిచింది. తరువాత మిస్ ఎర్త్ అందాల పోటీలలో కూడా పాల్గొంది. ఆ తరువాత నటిగా రమన్ రాఘవ్ 2.ఓ సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఆ మూవీ సక్సెస్ కావడంతో తరువాత వరుసగా అవకాశాలు వచ్చాయి. గూఢచారి సినిమాలో అడివి శేష్ కి జోడీగా టాలీవుడ్ లోకి శోభిత ఎంట్రీ ఇచ్చింది. అయితే తెలుగమ్మాయి అయిన కూడా తెలుగులో శోభితకి పెద్దగా అవకాశాలు రాలేదు. గూఢచారి తర్వాత మరల అడివి శేష్ చేసిన మేజర్ మూవీలో కీలక పాత్రలో కనిపించింది. చివరిగా మంకీ మ్యాన్ అనే హాలీవుడ్ సినిమాతో శోభిత ప్రేక్షకుల ముందుకొచ్చింది. 2022 నుంచి శోభిత నాగ చైతన్యతో రిలేషన్ లో ఉంది. ఫైనల్ గా పెద్దలని ఒప్పించి ఇద్దరు ఒకటి కాబోతున్నారు. ఈ బ్యూటీ డిజిటల్ ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే మూడు వెబ్ సిరీస్ లలో నటించింది. ఆ మూడింటిలో కూడా శోభిత దూళిపాళ్ల బోల్డ్ అండ్ గ్లామర్ రోల్స్ లోనే కనిపించింది. త్వరలో పెళ్లి కూతురు కాబోతున్న శోభిత ఇన్ స్టాగ్రామ్ లో ట్రెడిషనల్ స్టైల్ లో చీరకట్టులో కనిపించి సందడి చేసింది. హైదరాబాద్ లో ఓ శారీ షోరూమ్ లో పాల్గొంది. అక్కడ దిగిన పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఈ ఫోటో క్రింద నెటిజన్లు, అక్కినేని ఫ్యాన్స్ ఇంటరెస్టింగ్ కామెంట్స్ పెడుతున్నారు. నాగ చైతన్యకి పర్ఫెక్ట్ గా సెట్ అవుతారంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ శారీలో చాలా అందంగా ఉన్నారని ప్రశంసిస్తూ కొందరు పోస్టులు పెడుతున్నారు. ఇదిలా ఉంటే ఆమె నటించిన రెండు సినిమాలు హిందీలో షూటింగ్ కంప్లీట్ చేసుకొని రిలీజ్ కి రెడీ అవుతున్నాయి.

# 50లోనూ ఇంత అందం ఏంటి మేడం



రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన రంగీలా సినిమాతో హిందీతో పాటు సౌత్ ప్రేకకులను కూడా తన అభిమానులుగా మార్చుకున్న ఊర్మిళ మటోండ్కర్. కేవలం సినీ నటిగా మాత్రమే కాకుండా రాజకీయ నాయకురాలిగా కూడా ఊర్మిళ సుపరిచితురాలు. చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఊర్మిళ హీరోయిన్ గా టర్న్ అయ్యి సుదీర్ఘ కాలం పాటు టాప్ స్టార్ హీరోయిన్ గా సినిమాలు చేస్తూ వచ్చింది. కేవలం హిందీలో మాత్రమే కాకుండా తెలుగు, తమిళ భాషల్లో కూడా నటించడం తో దేశ వ్యాప్తంగా గుర్తింపు సొంతం చేసుకుంది. వర్మ హీరోయిన్ గా పేరు పడ్డ ఊర్మిళ 2010 వరకు కంటిన్యూగా సినిమాలు చేస్తూ వచ్చింది. ఊర్మిళ ప్రస్తుత ఏజ్ 50 ఏళ్లు. ఆమె వయసు పెరిగిన కొద్దీ అందం పెరిగిందా అన్నట్లుగా పెరుగుతూ వచ్చింది. తాజాగా సోషల్ మీడియాలో ఊర్మిళ షేర్ చేసిన అందమైన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. 50 ఏళ్ల వయసులో ఇంత అందం మరే హీరోయిన్ కి సాధ్యం కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. చాలా మంది ఊర్మిళ వయసు 50 ఏళ్లు అయ్యి ఉండక పోవచ్చు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. 30 ఏళ్ల వయసులో హీరోయిన్స్ ఎంత అందంగా ఉంటారో అంతే అందంగా ఈ 50 ఏళ్ల వయసులో కూడా ఊర్మిళ ఉందంటూ నెటిజన్స్ ఇంకా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. 1977 లో కర్మ అనే చిత్రంతో బాల నటిగా అరంగేట్రం చేసిన ఊర్మిళ 1983 లో చేసిన మటోండ్కర్ సినిమాతో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది.

# కాపాడలేకపోయిన కోట్లు



**హైదరాబాద్ :** రెండు తెలుగు రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ వరదలతో జన జీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. వేల ఇండ్లు నీట మునిగిపోవటంతో లక్షల మంది నిరాశ్రయులయ్యారు. విజయవాడ, ఖమ్మం జిల్లాల్లో అయితే పరిస్థితి ఘోరంగా ఉంది. ఇక భారీ వరదలకు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా ప్రభావితమయ్యాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలే కాదు కోటీశ్వర్లు కూడా వరద బాధితులుగా మారి రోడ్డున పడ్డారు. కోట్లు, ఖర్చు చేసి ఖరీదైన, విలాసవంతమైన విల్లాలు కొనుగోలు చేసిన వారు కూడా ఆకలితో అలమటిస్తున్నారు. ప్రకృతి ప్రకోపానికి పేద,ధనిక తేడా లేదనటానికి ఈ ఘటనే ఉదాహరణ అని పలువురు పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.గత రెండ్రోలుజు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు హైదరాబాద్ శివారు శంకర్‌పల్లి మండలం మోకీల పరిధిలోని పలు విల్లాలు నీట మునిగాయి. లా పలోమా విల్లాస్ కమ్యూనిటీలోకి భారీగా వరద నీరు పోటెత్తింది. అక్కడ సుమారు 210 విల్లాలు ఉండగా.. అవన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు విల్లాల పక్కన ఉన్నే వాగు పొంగి ప్రవహించింది. దానికి తోడు చుట్టూ కొత్తగా నిర్మించిన పలు కమ్యూనిటీ విల్లాస్‌లో నీటి వ్యవస్థలు సక్రమంగా నిర్వహించకపోవటంతో వరద నీరు విల్లాల్లోకి చేరిందిదీంతో రూ. కోట్లు విలువ చేసిన కొనుగోలు చేసిన విల్లాల్లోకి నీరు చేరింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వరద చేరటంతో ఖరీదైన సోఫాలు, ఇంటి సామగ్రి తడిసిపోయాయి. లక్షల ఖరీదైన కార్లు నీట మునిగాయి. చెరువును తలపిస్తూ కమ్యూనిటీ ప్రాంతమంతా నీటితో నిండిపోయింది. బయట పరిస్థితిని చూసిన పలువురు విల్లావాసులు లబోదిబోమని నెత్తినోరూ బాదుకుంటున్నారు. తాగటానికి మంచినీరు కూడా లేదని.. పాలు, నిత్యవసర సరుకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కోట్లు పెట్టి విల్లాలు కొనుగోలు చేసి ఇప్పుడు రోడ్డు మీద పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా, కాలువలు, చెరువులు కబ్జా చేసి విల్లాలు నిర్మించటం వల్లే వరద పోటెత్తిందనే ఆరోపణలు వస్తున్నాయి. నాలా ప్రవాహానికి అడ్డుగా ఈ విల్లాలు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న చెరువులలోకి వెళ్లాల్సిన వరద నీటిని దారి మళ్లించటంతోనే విల్లాలు నీట మునిగాయని అంటున్నారు. వీటిపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీంతో హైడ్రా వీటిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# సీఎంఆర్‌ఎఫ్ స్కామ్ మామూలుగా లేదుగా

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) స్కామ్‌లో ప్రభుత్వ నిధులను స్వాహా చేసేందుకు నకిలీ మెడికల్ బిల్లులు సమర్పించిన ఇద్దరు వ్యక్తులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల నుంచి సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. దీంతో ఆగస్టు 23న ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.నిరుపేద రోగుల వైద్యం కోసం ఉద్దేశించిన (సీఎంఆర్‌ఎఫ్ నుండి నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై తెలంగాణలోని 27 ఆసుపత్రులపై అవిఆ విచారణ జరుగుతోంది. ఈ ఆసుపత్రులపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించింది సీఐడీ. విచారణలో భాగంగా నల్గొండ జిల్లాకు చెందిన నిందితులు గొట్టి గిరి(46), ఆసుపత్రి సూపర్‌వైజర్ లెకిరెడ్డి సైదిరెడ్డి(40)లను పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాల్‌గూడలో స్థానిక ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ వ్యవహారం నడిచినట్లు పోలీసులు గుర్తించారు. డెస్కటాప్ కంప్యూటర్లతో నకిలీ సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు సృష్టించి వైద్యులు, ఆసుపత్రుల రబ్బరు స్టాంపులను తయారు చేశారు. నిందితులు ఒక్కో దరఖాస్తుకు రూ.4,000 చొప్పున వసూలు చేసి, నల్గొండలోని అమ్మ హాస్పిటల్, మిర్యాలగూడలోని నవీనా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పేర్లతో అవసరమైన రోగులకు




సహాయం చేయడానికి 19 నకిలీ క్లెయిమ్‌లను సమర్పించారు.నల్గొండలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిఐడి) ఆగస్టు 30న ఇద్దరిని అరెస్టు చేసింది. నిందితుల నుంచి నకిలీ మెడికల్ బిల్లులు, రబ్బరు స్టాంపులు, నకిలీ లెటర్ హెడ్‌ల సాఫ్ట్ కాపీలతో కూడిన కంప్యూటర్ హార్డ్ డిస్క్‌తో సహా కీలకమైన సాక్ష్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టు ముందు హాజరుపరచగా, వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. స్కామ్‌లో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసేందుకు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# ఖమ్మంలో ఇంకా కన్నీళ్లే

**ఖమ్మం :** ఖమ్మం నగరంలో ఎటు చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. వరదకు చెల్లాచెదురుగా మారిన బాధితుల కన్నీళ్లే తారసపడుతున్నాయి. ఇంకా ఖమ్మం నగరం జల దిగ్బందంలోనే ఉంది. గోదారిలా ఉగ్ర రూపం చూపించిన మున్నేరు ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. 36 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి ప్రవహించిన మున్నేరు ఖమ్మం నడి బొడ్డున భయానక వాతావరణమే సృష్టించింది. వరద తాకిడికి ఇంకా అనేక ప్రాంతాలు ముంపులోనే ఉండిపోయాయి. వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. కొంచెం వరద తగ్గడంతో బురదలో కూరుకుపోయిన ఇండ్లను చూసి బాధితులు ఘోల్లుమంటున్నారు. విలువైన సామాన్లు కొట్టుకుపోయాయి. తిండి గింజలు, తాగునీరు కూడా లేకుండా వరద ముంచేయడంతో బాధితుల వేదన వర్ణనాతీతంగా మారింది.ఒకటో అంతస్తు వరకు నీళ్లు రావడంతో ఏం చేయాలో తెలియక కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశామని బాధితులు వాపోతున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరు ఉగ్రరూపం దాల్చడంతో చుట్టూ ఉన్న రామన్నపేట నుంచి దానవాయిగూడెం, బ్రిడ్జి డౌన్, ఎఫ్సీఐ గోడౌన్, ఎంబీ గార్డెన్ పూర్తిగా మునిగిపోయాయి. నయా బజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద నీరు వచ్చి చేరింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపోయాయి. మోతీనగర్, బొక్కల గడ్డ, నయాబజార్, మంచికంటి నగర్, సుందరయ్య నగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్ కాల్వకట్ట, ధంసలాపురం నీట మునిగాయి. మూడో పట్టణానికి రంగనాయకుల గుట్ట పెట్టని గోడలా నిలిచింది. ఇదే లేకపోతే గాంధీ చౌక్ నుంచి మొదలకొని ముస్తఫానగర్ మీదుగా జరిగే ప్రమాదం ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి. రైల్వే ట్రాక్ దాటి రాపర్తి నగర్, కూరగాయల మార్కెట్ దాక వరద పోటెత్తింది. 30 ఏళ్ల కిందట వచ్చిన వరద కంటే ఇప్పుడు వచ్చిన వరద దారుణమని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సర్వం కోల్పోయామని బోరుమంటున్నారు.ముప్పై ఏళ్ల క్రితం బైపాస్ రోడ్డు మీదకు మాత్రమే నీళ్లు వచ్చాయి. కానీ తాజాగా మున్నేరు వరద ఖమ్మం చరిత్ర రికార్డ్ నే బ్రేక్ చేసింది. నయాబజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద వచ్చింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపో యాయి. మోతీనగర్, బొక్కలగడ్డ, నయాబజార్ వెనుక భాగం, మంచికంటి



నగర్, సుందరయ్యనగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్, కాల్వకట్ట, దంసలాపురం కాలనీల్లో ఇండ్లు మొత్తం మునిగిపోయాయి.శనివారం రాత్రి అతి భారీ వర్షం కురిసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచే మున్నేరుకు వరద ఉధృతి మొదలైంది. నిమిషాల వ్యవధిలోనే వరద పెరుగుతున్న తీరును అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఫలితంగానే చుట్టుపక్కల కాలనీల ప్రజలు వరద బీభత్సానికి గురయ్యారు. మున్నేరు వరద రెప్పపాటున రావడంతో రెండు మూడు ఫ్లోర్లు బిల్డింగ్ ఉన్న వారు సైతం పైకి ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో అన్ని సామాన్లు తడిచి ముద్దయిపోయాయి.ప్రకాశ్ నగర్ లోని టింబర్ డిపోలు నీటిలో కొట్టుకుపోయి నేలమట్టమయ్యాయి. ప్రతి దుకాణంలోని టేకు కర్రలు, మిషన్లు నీటిలో మునిగి భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. మున్నేరు పరివాహక ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. 31వ డివిజన్ లో పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతంలో మున్నేటికి ఆనుకొని నిర్మించిన వెంచర్ లో ఇండ్లు కట్టుకున్న వారందరికీ వరద కన్నీటిని మిగిల్చింది. 15 అడుగులకు పైగా వరద రావడంతో ఇండ్లలోని సామాన్లు మొత్తం బురదలో చిక్కుకుపోయాయి. ఓ పాల వ్యాపారికి గేదెల మరణం తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇండ్లలో చేరిన వరదను తొలిగించుకునే పనిలో పడ్డారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# మల్లారెడ్డి నెక్ట్స్ టార్గెట్



**హైదరాబాద్ :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ – హైడ్రా. ఈ పేరు వినగానే ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడి నుంచి, ఏ బుల్డోజర్ వచ్చి తమ ఇళ్లు కూల్చేస్తుందో అని భయం భయంగా గడుపుతున్నారు. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. నగరంలోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసినట్లు ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అడ్డాలో ఏవీ రంగనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆ ప్రాంతంలో ఉన్న అక్రమ కట్టడాల గురించి ఆరా తీశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మేకల కావ్యకు చెందిన ఫామ్‌హౌస్‌కు అనుమతులు లేవని గుర్తించారు. అంతేకాకుండా అంబేడ్కర్ నగర్‌లోని ఇంద్రా చెరువు, డంపింగ్ యార్డు సమీపంలోని నాలా ఆక్రమణకు గురైనట్టు హైడ్రా అధికారులు తేల్చారు. ఇక ఫామ్‌హౌస్‌కు అనుమతులు జారీ చేసిన అధికారులపై.. చెరువు ఆక్రమణలపై అలసత్వం ప్రదర్శించిన అధికారులపైనా చర్యలు తీసుకోనున్నట్టు ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆక్రమణదారులకు ఏవీ రంగనాథ్ వార్నింగ్ ఇచ్చారు. పేద వారిపై అయినా కాస్త జాలి చూపిస్తామేమో గాని.. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బడా బాబులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఫామ్‌హౌస్‌లను, నిర్మాణాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చి వేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.అయితే పేదల పేరుతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వాన్ని మోసం చేయాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. అలాంటి వారిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా తాజాగా హైడ్రా కమిషనర్ తన బృందంతో జవహర్ నగర్‌లో పర్యటించడంపై.. ఇక హైడ్రా నెక్ట్స్ టార్గెట్ అక్కడే అని స్థానికులు చర్చించుకుంటున్నారు

# దంతేవాడలో జగన్ చనిపోయినట్టేనా
# మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ



**వరంగల్ :** ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే వీరిలో మావోయిస్టు అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ ఏ దాదా రణదేవ్ దాదా ఉన్నారు. కేంద్ర మిలిటరీ ఇన్చార్జ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ బార్డర్ ఇంచార్జ్ గా వ్యవహరించిన ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందినట్టు దంతేవాడ పోలీసులు ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడు కావడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. అగ్రనేత స్వగ్రామం కాజీపేట మండలం టేకులగూడెం అని, ఇటీవల జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో జగన్ కూడా చనిపోయాడని దంతేవాడ ఎస్పీ తాజాగా ప్రకటించారు. ఛత్తీస్ గఢ్‌లో ఆపరేషన్ మావోయిస్టుల లక్ష్యంగా బలగాలు కూంబింగ్ ను కొనసాగిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో మావోయిస్టులను ప్రాంతాలు మారుతున్నారు. ఈ క్రమంలో పోలీస్ బలగాల కూంబింగ్ కొనసాగించారు. రెండు రోజుల కిందట ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతేవాడ పోలీసులు ధృవీకరించారు. ఛత్తీస్ గఢక్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన పోలీస్ బలగాలు దంతెవాడ, బీజాపూర్ ప్రాంతంలోని అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతేవాడ పోలీసులు ధృవీకరించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొని, అనంతరం సైతం కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలు, వారిపై రివార్డ్ ఎంతంటే..1. రణదేవ్ (మాచర్ల ఏసోబు అలియాస్ జగన్) వరంగల్ నివాసిపై రివార్డు – రూ.25 లక్షలు2. సుశీల మడకం, భర్త జగదీష్.. రివార్డు – రూ.5 లక్షలు3. కుమారి శాంతి, పోస్ట్– 31 ఖఇ సభ్యులు. రివార్డు – రూ.5 లక్షలు4. కోసా మాడ్వి, హోదా– మలంగిర్. ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు – రివార్డు– రూ.5 లక్షలు.5. గంగి ముచకి, హోదా– కాటేకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు – రివార్డు–రూ.5 లక్షలు.6. లలిత, పోస్ట్– సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు – రూ.5 లక్షలు.7. కవిత, పోస్ట్ గార్డ్ ఆఫ్ యాహాజిఅగా ఉన్నారు.

# బీహార్ రాజకీయాల్లో ప్రకంపనలు

**పాట్నా :** బీహార్ రాజకీయాల్లో మరోసారి 'పొలిటికల్ గేమ్' జరగబోతుందా? సింగపూర్ నుంచి ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తిరిగి రావడంతో బీహార్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, అసెంబ్లీ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. ఇప్పుడు రెండవ రోజు, ఖీఏఆ ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో లాలూ ప్రసాద్ యాదవ్ సమావేశమవుతున్నారు. ఈ పరిస్థితులన్నింటిని గమనిస్తుంటే, రాష్ట్రంలో కొత్త ప్రయోగానికి స్క్రిప్ట్ రానుకుంటున్నట్లు కనిపిస్తోంది.ముఖ్యమంత్రి సచివాలయంలో సీఎం నితీశ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. నితీష్–తేజస్విల ఈ వన్ టు వన్ భేటీ అకస్మాత్తుగా జరగలేదు కానీ ప్లాన్ చేసిందే అంటున్నారు పార్టీ వర్గాలు. బీహార్‌లో సమాచార కమిషనర్ నియామకంపై చర్చించేందుకు ఇరువురు నేతలు సమావేశమయ్యారు. సమాచార కమిషనర్ నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ముఖ్యమంత్రితోపాటు, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, కేబినెట్ మంత్రి కూడా ఉన్నారు. అందుకే ఇద్దరు నేతలూ సమావేశమయ్యారు. అయితే సమాచార కమిషనర్ పేర్ల గురించి చర్చించడానికి బదులుగా, కొత్త పొలిటికల్ కెమిస్ట్రీని సృష్టించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే, ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను కలిసిన తర్వాత తేజస్వి యాదవ్ బయటకు వచ్చినప్పుడు, అతను స్వయంగా మొత్తం పరిస్థితిని ముందుకు తీసుకువచ్చాడు. కొన్ని నియామకాలు జరగాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా సమాచారం ఇవ్వనుంది. 65 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై సీఎంతో మాట్లాడినట్లు తేజస్వి తెలిపారు. అయితే ఈ అంశం కోర్టులో ఉందని, దీనిపై తాను కోర్టును ఆశ్రయించినట్లు తేజస్వీ తెలిపారు. ప్రభుత్వం తన అభిప్రాయాలను కోర్టులో తెలియజేయాలని, తాను కూడా తన అభిప్రాయాలను తెలియజేస్తానని అన్నారు.మరోవైపు తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లాలూ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. తన ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ




ఎన్నికల్లో పోటీ చేసిన శాసనమండలి సభ్యులు, అభ్యర్థులను లాలూ యాదవ్ పిలిచారు. పార్టీ సంస్థాగతాన్ని బలోపేతం చేసేందుకు అందరికి పిలుపునిచ్చినట్లు ఆర్జేడీ వర్గాలు పేర్కొన్నాయి. తేజస్వీ యాదవ్ సెప్టెంబర్ 10 నుంచి బీహార్‌లో అభర్ యాత్ర ప్రారంభించనున్నారు. లాలూ యాదవ్ తన పర్యటనను విజయవంతం చేసేందుకు వ్యూహరచన చేయడం ప్రారంభించారని, అందుకే ఆర్జేడీ తన నేతలతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.ఒకవైపు బీహార్ సెక్రటేరియట్‌లో నితీష్, తేజస్విలు సమావేశమవుతుండగా, మరోవైపు లాలూ యాదవ్ తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నితీష్, తేజస్విల భేటీకి అనేక కారణాలు చెబుతున్నప్పటికీ ఈ భేటీ ఒక్కసారిగా బీహార్‌లో రాజకీయ ఉత్కంఠకు తెర లేచినట్లైంది. సమాచార కమిషనర్ నియామకమే ఈ సమావేశం ఉద్దేశమని తేజస్వి చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా కేవలం సమాచార కమిషనర్ నియామకానికే పరిమితం కాలేదన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. బీహార్‌లో పొలిటికల్ గేమ్ గురించి ఊహాగానాలు జరుగుతున్నాయి. ఎందుకంటే 2022 లో తేజస్వి, నితీష్ మధ్య అలాంటి సమావేశాలు జరిగాయి. ఆపై రాష్ట్ర రాజకీయ ఆట మారిపోయింది. అదే సమయంలో తేజస్వి యాదవ్ కుల గణన చేయాలనే డిమాండ్‌తో నితీష్‌ను కలిశారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.